
E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 08-03-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక:65 || పేజీలు–6 www.ekaburu.com



....(మిగతా2లో)

## రేవంత్ రెడ్డి కర్ణుడు కాదు..
# మహా క్రూరుడు

- రేవంత్ పాలనలో రైతులు కన్నీరు పెడుతున్నరు
- కేసీఆర్ పాలన అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్
- కాంగ్రెస్ సర్కార్ విధ్వంసానికి కేరాఫ్ అడ్రస్
- 420 హామీలతో ప్రజలను నట్టేట ముంచిర్రు
- దమ్ముంటే గన్‌మెన్‌లు లేకుండా గ్రామాల్లోకి రావాలి ; హరీష్ రావు



**ఈ కబురు** ; సీఎం రేవంత్ రెడ్డి తనను తాను కర్ణుడితో పోల్చుకోవడం హాస్యాస్పదమని.. ఆయన కర్ణుడు కాదు మహా క్రూరుడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు ధ్వజమెత్తారు. శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గ కేంద్రంలో జరిగిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

....(మిగతా2లో)

## తెలంగాణ గడ్డపై
# హింసకు తావులేదు

- 130 మంది మావోయిస్టులు సిఎం సమక్షంలో లొంగుబాటు
- హింసాత్మక చర్యల ద్వారా ఏమీ సాధించలేరు
- మావోయిస్టు పార్టీ సుప్రీం ముప్పాళ్ల లక్ష్మణరావు ఎలియాస్ గణపతి కూడా వీలైనంత త్వరగా లొంగిపోవాలి
- మెరుగైన పరిహారం, ఆరోగ్యం, ఇంటి నిర్మాణానికి సాయం చేస్తాం
- అవకాశం ఉన్న కేసులను ఎత్తివేస్తాం; సిఎం రేవంత్ రెడ్డి



**ఈ కబురు, హైదరాబాద్:**


తెలంగాణ గడ్డపై హింసకు తావులేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హింసాత్మక చర్యల ద్వారా ఏమీ సాధించలేరని చెప్పారు. భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయేలా పోలీసులు కృషి చేశారని, వారిలో ఒక నమ్మకాన్ని కలిగించారని కితాబిచ్చారు. లొంగిపోయిన మావోయిస్టులు మంచి జీవితం గడిపేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మొత్తం 130 మంది మావోయిస్టులు సీఎం సమక్షంలో ప్రభుత్వం ఎదుట లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం మీడియాతో మాట్లాడారు. ''అహింసా పద్ధతిలోనే బ్రిటీషర్లపై పోరాడి స్వాతంత్ర్యం తెచ్చుకున్న చరిత్ర మనది. హింస, ఆయుధాలతో పోరాటం ఒక్కటే సమస్యలకు పరిష్కారం కాదని గాంధీ చాటి చెప్పారు. అణ్వాయుధాలు ఉన్న దేశాలు కూడా ఇవాళ చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకుంటున్నాయి. ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులకు విజ్ఞప్తి చేస్తున్నా. ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసురావాలి. దేవ్‌జీ, ఆయన మిత్రబృందం కొన్ని ప్రతిపాదనలు చేసింది. తమ సమస్యలు పరిష్కరిస్తే లొంగిపోతామని వాళ్లు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో మేము చేయగలిగింది చేస్తామని చెప్పాను. మావోయిస్టు నేతల డిమాండ్లను కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో చర్చించాను. లొంగిపోయిన వారి మెరుగైన జీవితానికి హామీ ఇవ్వాలని అమిత్ షా సూచించారు. ఆయనతో చర్చల తర్వాత మావోయిస్టు నేతలతో మళ్లీ చర్చించాను.

....(మిగతా2లో)




బెంగాల్ పర్యటనలో
### ప్రొటోకాల్ వైఫల్యం
### .. రాష్ట్రపతి అసహనం

ఈ కబురు : పశ్చిమ బెంగాల్ పర్యటనలో ప్రొటోకాల్ వైఫల్యంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అసహనం వ్యక్తం చేశారు. ఉత్తర బెంగాల్‌లో అంతర్జాతీయ ఆదివాసీ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం




పొరుగు దేశాలకు ఇరాన్
### లొంగిపోయింది: ట్రంప్

ఈ కబురు : దాడుల విషయంలో గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పిన వ్యవహారంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. పశ్చిమాసియాలో ఓటమి పాలైన దేశంగా ఇరాన్‌ను పేర్కొన్నారు. ఆ దేశం దాని పొరుగు దేశాలకు క్షమాపణలు చెప్పి లొంగిపోయిందన్నారు




హైదరాబాద్ నగరాన్ని
### క్లీన్ సిటీగా మార్చండి

ఈ కబురు,హైదరాబాద్;

హైదరాబాద్ మహానగరాన్ని పూర్తిస్థాయిలో పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం కోర్ అర్బన్ రీజియన్ (CUR) పరిధిలోని ట్రై మున్సిపల్ కార్పొరేషన్ల

# అవకాశాల గనిగా భారత్
## ... త్వరలోనే రివర్స్ మైగ్రేషన్

- డేంజర్ బెల్స్ ను ఊహించే పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ
- ప్రతిష్టాత్మక రైసినా డైలాగ్ 2026 సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- తొలిసారి రైసినా డైలాగ్ సదస్సుకు ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆహ్వానించిన నిర్వాహకులు




**ఈ కబురు** : అనేక దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడకు వెళ్లినా భారతీయులు కనిపిస్తారని ఆయన స్పష్టం చేశారు. టెక్నాలజీ, టెలి కమ్యూనికేషన్స్ లాంటి సంస్కరణల్ని మొదటగా అందిపుచ్చుకోవటం వల్లే భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని సీఎం వివరించారు. ఢిల్లీలో భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైసినా డైలాగ్ సదస్సులో సాంకేతికత సుపరిపాలన భవిష్యత్తు అనే అంశంపై చంద్రబాబు మాట్లాడారు.

....(మిగతా2లో)

## ఈ నెలాఖరులోగా
## లక్ష ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు

- మంజూరు చేసిన అన్ని ఇండ్లు గ్రౌండింగ్ కావల్సిందే
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు లబ్దిదారులను గుర్తించండి
- మంజూరు చేసిన అన్నిఇండ్లకు చెల్లింపులు జరపాలి
- ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యాచరణపై జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్



ఈ కబురు ,హైదరాబాద్:
రాష్ట్రంలో ప్రతి పేదవాడి ఆత్మగౌరవానికి చిహ్నంగా నిలిచేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తోందని, ఈ పథకం ఒక బెంచ్ మార్క్‌గా నిలవబోతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

....(మిగతా2లో)



ఏసీబీకి చిక్కిన భారీ అవినీతి తిమింగలం ....(3లో)




కామారెడ్డిలో కలకలం
.. రెండు రోజుల్లో ఐదుగురు చిన్నారుల అదృశ్యం ....(3లో)



మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నాం
... రేవంత్‌రెడ్డి ....(3లో)



ప్రపంచ స్థాయి ఏఐ ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్
.. మంత్రి శ్రీధర్‌బాబు ....(3లో)

## నేపాల్ ప్రధాని పీఠానికి చేరువలో
# మాజీ ర్యాపర్!



ఈ కబురు : సుదీర్ఘ కాలంగా రాజకీయ అనిశ్చితిని ఎదుర్కొంటున్న నేపాల్‌లో సంప్రదాయ రాజకీయ నేతలకు కాలం చెల్లినట్లే కనిపిస్తోంది. జెన్‌జీ తిరుగుబాటు అనంతర పరిణామాలు చూస్తుంటే అక్కడి రాజకీయ ముఖచిత్రం మారిపోతున్నట్లు తెలుస్తోంది. గత 18 ఏళ్లలో 14 ప్రభుత్వాలు మారిన ఈ హిమాలయ రాజ్యంలో.. త్వరలోనే ఓ యువనేత సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తాజా సార్వత్రిక ఎన్నికల్లో సంప్రదాయ దిగ్గజాలను పక్కకునెట్టి అఖండ విజయం దిశగా దూసుకెళ్తున్నారు నేపాలీ యువ నేత బాలేంద్ర షా.

——ఎవరీ బాలేంద్ర షా..?

కాఠ్‌మాండూలోని నారాదేవిలో 1990 ఏప్రిల్ 27న బాలేంద్ర షా జన్మించారు. ఈయనను బాలెన్ షాగా పిలుస్తుంటారు. తండ్రి ఆయుర్వేద వైద్యుడు. వీరి కుటుంబం మాధేశ్ నుంచి రాజధానికి వచ్చి స్థిరపడింది. కర్ణాటకలోని ఓ యూనివర్సిటీ నుంచి స్ట్రక్చరల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ చేశారు.

....(మిగతా3లో)

# ఇరాన్ బిగ్ యూటర్న్...!

- తోటి గల్ఫ్ దేశాలకు క్షమాపణలు చెప్పిన ఇరాన్
- దాడులకు ఫుల్ స్టాప్
- గల్ఫ్, మిడిల్ ఈస్ట్ లోని ఏ దేశం పైన క్షిపణి దాడులు ఉండవు తేల్చి చెప్పిన ఇరాన్
- అమెరికా మిత్ర దేశం సౌదీ అరేబియా కీలక నిర్ణయం
- సౌదీ ప్రభుత్వం , ఇరాన్ తో తెర వెనుక చర్చలు



ఈ కబురు ; అమెరికా ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. దాదాపుగా గల్ఫ్ దేశాలన్నీ దీని వల్ల ప్రభావితం అయ్యాయి. సౌదీ అరేబియా మొదలుకుని బహ్రెయిన్ వరకూ ఏదీ మినహాయింపు కాదు. ఆయా దేశాల్లోని అమెరికన్ ఎయిర్ బేస్ స్టేషన్లు, రాయబార కార్యాలయాలను ఇరాన్ వదిలిపెట్టట్లేదు. వాటన్నింటిపైనా మిస్సైళ్ల వర్షాన్ని కురిపిస్తోంది. డ్రోన్లతో శక్తిమంతమైన బాంబులను జారవిడుస్తోంది. ఈ పరిణామాల మధ్య ఇరాన్ అనూహ్య నిర్ణయం తీసుకుంది. తోటి గల్ఫ్ దేశాలకు క్షమాపణలు చెప్పింది. ఈ మేరకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ దేశ ప్రజలను ఉద్దేశించి టీవీలో మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై జరిగిన దాడుల విషయంలో చింతిస్తున్నామని తెలిపారు. పొరుగు దేశాలకు క్షమాపణలు చెప్పారు. ఆక్రమించాలనే ఉద్దేశ్యం గానీ, సరిహద్దులను దాటుకుని వాటి భూభాగంపైకి చొచ్చుకుని రావాలనే ఆలోచన గానీ ఎంతమాత్రం లేదని స్పష్టం చేశారు.

....(మిగతా3లో)

## వచ్చే ఏడాది నుంచి
## వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ

- వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ నిధులు నేరుగా రైతుల ఖాతాలోకి బదిలీ చేసేలా విధివిధానాలు తయారుచేయాలి
- ఎప్రిల్ నెలాఖరు వరకు పచ్చిరొట్ట విత్తనాలను సిద్ధం చేయాలి; మంత్రి తుమ్మల
- రైతు వేదికలపై రెడ్కో సహకారంతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు మంత్రి తుమ్మల ఆదేశాలు
- ఖరీఫ్ సీజన్ కోసం ముందుగానే ఎరువులను తెప్పించి, నిల్వ ఉంచుకోవాలని అధికారులకు అదేశం

....(మిగతా3లో)




# గద్దర్ అవార్డ్స్ 2025

- చిరంజీవికి ఎన్టీఆర్ నేషనల్ అవార్డు
- ఉత్తమ నటీనటులుగా రష్మీ, నాగచైతన్య
- ఉత్తమ చిత్రం రాజు వెడ్స్ రాంబాయి,
- ఉత్తమ ద్వితీయ చిత్రం దండోరా




**ఈ కబురు, హైదరాబాద్ :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ -2025' విజేతలను ప్రకటించింది.

....(మిగతా5లో)

# తెలంగాణలో 40 డిగ్రీలు దాటిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు



ఈ కబురు, హైదరాబాద్: మార్చి ప్రథమార్ధం లోనే తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. రాష్ట్రంలో పలు చోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. గతేడాది కంటే ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ చెప్పింది. చిన్న పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ ఏడాది అధిక వర్షపాతం, ఎక్కువ చలి తీవ్రత వల్లే ఎండలు అధికంగా ఉంటాయని పేర్కొంది.

# ఈ నెలాఖరులోగా లక్ష ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు



ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు 3.60 లక్షల ఇండ్లను మంజూరు చేయగా ఇందులో లక్ష ఇండ్లకు ఈనెల 31వ తేదీలోగా గృహప్రవేశాలు జరుగనున్నాయని తెలిపారు. ఇందుకోసం త్వరలోనే గృహప్రవేశాలకు అనుకూలమైన తేదీలను అధికారికంగా తెలియజేస్తామని తెలిపారు.ఇండ్లు మంజూరు చేసిన తర్వాత కూడా కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ పూరిగుడిసెలు కనిపిస్తున్నాయని, అటువంటి కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఇళ్ల నిర్మాణంలో చేర్చాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చే ప్రతి ఇల్లు నిజంగా అవసరమైన వారికి చేరేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయం నుంచి ప్రజాపాలన ప్రగతి నివేదిక 99 రోజుల్లో చేపట్టవలసిన కార్యాచరణపై జిల్లా హౌసింగ్ పీడీలతో మంత్రి గారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మంజూరు చేసిన ఇండ్లలో 20 శాతం వరకు గ్రౌండింగ్ కాలేదని అలాంటి ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల సమ్మతి తీసుకుని స్థానిక ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీల సూచనలతో మార్చి 31 లోపు అన్ని ఇండ్లు గ్రౌండింగ్ అయ్యేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తికి దగ్గరగా ఉన్న ఇళ్లను సమర్థంగా సమన్వయం చేసుకొని జూన్ చివరినాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏప్రిల్ నెలలో రెండవ దశ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసే నాటికి మొదటి దశ ఇందిరమ్మ ఇండ్లు కొలిక్కి రావాలని సూచించారు. ఇండ్ల నిర్మాణంలో ఉపయోగించే నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం వల్ల లబ్ధిదారులపై అదనపు భారం పడకుండా జిల్లా స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలు చురుకుగా పనిచేయాలని మంత్రి సూచించారు. అవసరమైతే జిల్లా కలెక్టర్లతో కలిసి సమీక్షించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇటుకల సరఫరా పెంచేందుకు స్థానికంగా ఎస్ హెచ్ జి మహిళా సంఘాల ద్వారా బ్రిక్ యూనిట్లను ప్రోత్సహించాలని మంత్రి తెలిపారు. అవసరమైతే ప్రతి మండలంలో ఒకటి లేదా రెండు యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా సరఫరా పెరిగి ధరలు నియంత్రణలో ఉండే అవకాశముందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల కోసం ఉచిత ఇసుక పంపిణీ చేస్తుందని లబ్దిదారులకు ఎక్కడా సమస్య రాకుండా ఈ ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రాష్ట్రంలో కొన్ని చోట్ల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి ఒకటి లేదా రెండు విడతల చెల్లింపులు చేసిన తర్వాత వివిధ కారణాలతో చెల్లింపులు నిలిపివేయడం సరికాదన్నారు. ఇటువంటి చెల్లింపులను తక్షణమే క్లియర్ చేయాలని లేని పక్షంలో అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని హెచ్చరించారు. ఏప్రిల్ నెల నుంచి మంజూరు చేసే రెండవ విడతలో ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నిజమైన లబ్ధిదారుల ఇళ్లు ఎక్కడా ఆగిపోకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఏ స్థాయిలో నిర్మాణంలో ఉన్నాడబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికను కూడా మార్చి 31 లోపు పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. ఇళ్ల స్థలం లేని పేద కుటుంబాలకు ఈ ఇండ్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఏ సంక్షేమ పథకం విజయవంతం కావాలంటే ముఖ్యమంత్రి, మంత్రి, కార్యదర్శి మాత్రమే ప్రయత్నించడం సరిపోదని, ఆ శాఖలోని ప్రతి అధికారి ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పనిచేసినప్పుడే అది సాధ్యమవుతుందని మంత్రి పేర్కొన్నారు. అధికారుల సమిష్టి కృషి వల్లే రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశంలోనే ఉత్తమ పథకాలలో ఒకటిగా నిలిచిందని మంత్రి తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం అందించే గొప్ప సంక్షేమ కార్యక్రమమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం, అధికారులు భాగస్వాములుగా ఉండటం గర్వకారణమని, ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడానికి ప్రతి అధికారి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని హౌసింగ్ రంగంలో విజయవంతం చేయడానికి అధికారులు పూర్తి స్థాయిలో కృషి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ కార్యదర్శి విపి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# పొరుగు దేశాలకు ఇరాన్ లొంగిపోయింది: ట్రంప్

ఇకపై దాడులు చేయబోమని కూడా హామీ ఇచ్చిందని గుర్తుచేస్తూ.. అమెరికా, ఇజ్రాయెల్ నిరంతర దాడుల వల్లే ఇది సాధ్యమైందన్నారు. పశ్చిమాసియాను ఇరాన్ ఇక బెదిరించలేదని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ''పశ్చిమాసియాను గుప్పిట్లో పెట్టుకుని, పాలించాలని ఇరాన్ చూసింది. కానీ, ఓటమి పాలైంది. ఆ దేశం లొంగిపోవడమో, లేదా కుప్పకూలిపోవడమో జరిగేవరకు.. దశాబ్దాలపాటు పరిస్థితి ఇలాగే కొనసాగుతుంది. ఈ రోజు ఇరాన్‌పై భీకర దాడులు జరగనున్నాయి. ఆ దేశ దుష్ప్రవర్తన కారణంగా.. అక్కడి ప్రాంతాలను సర్వనాశనం చేసే అంశం కూడా పరిశీలనలో ఉంది'' అని ట్రంప్ హెచ్చరించారు. ఇజ్రాయెల్, అమెరికా దాడులతో ఇరాన్ ప్రతిదాడులు మొదలుపెట్టిన విషయం తెలిసిందే. అమెరికా స్థావరాలపై దాడుల పేరిట పశ్చిమాసియా దేశాలపై పెద్దఎత్తున క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తోంది. ఈ క్రమంలోనే ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. గల్ఫ్ దేశాలకు క్షమాపణలు చెప్పారు. ఈ దేశాలపై ఇకపై దాడులు చేయబోమన్నారు. అయితే, అవి తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం.. స్పందించే హక్కు ఉందని స్పష్టం చేశారు.

## తెలంగాణ గడ్డపై

# హింసకు తావులేదు



మా చర్చల అనంతరం ఒకేసారి 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఒకేసారి ఇంతమంది మావోయిస్టులు ఏ రాష్ట్రంలోనూ లొంగిపోలేదు. మావోయిస్టు పార్టీ సుప్రీం ముప్పాళ్ల లక్ష్మణరావు ఎలియాస్ గణపతి కూడా వీలైనంత త్వరగా లొంగిపోవాలి. ఆయనకు ప్రభుత్వం రక్షణ కల్పిస్తుంది. స్వగ్రామాల్లో ఇల్లు కట్టుకునేవారికి సాయం చేస్తాం. మెరుగైన పరిహారం, ఆరోగ్యం, ఇంటి నిర్మాణానికి సాయం చేస్తాం. ఇప్పటి వరకు 721 మంది మావోయిస్టులు లొంగిపోయి 250 ఆయుధాలను సరెండర్ చేశారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఆరోగ్య భద్రత కార్డులు ఇస్తాం. నగదు బహుమతిపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ వర్గాల నిఘా ఉంటుంది. కాబట్టి అందరూ లొంగిపోండి'' అని రేవంత్ పిలుపునిచ్చారు.

--అవకాశం ఉన్న కేసులను ఎత్తివేస్తాం

సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీలో ఉన్నవాళ్లు జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. అందరూ కలిసి వస్తే, తెలంగాణ పునర్నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. '' గూడేలు, తండాల్లో ఉన్నవారి మెరుగైన జీవితానికి కృషి చేద్దాం. ఆదివాసీ, గిరిజనుల ఆర్థికస్థోమత పెరిగేలా మేం కృషి చేస్తున్నాం. మావోయిస్టులపై ఎత్తివేయగల కేసులు ఉంటే ప్రభుత్వం సానుకూలంగా ఉంది. చట్టపరంగా ఎత్తివేయడానికి అవకాశం ఉన్న కేసులను ఎత్తివేస్తాం. తీవ్రమైన నేరాలు ఉంటే ప్రభుత్వాలు ఎత్తివేసినా.. కోర్టులు ఊరుకోవు. వ్యక్తులు, వారిపై ఉన్న నేరాల తీవ్రతనుబట్టి పరిశీలిస్తాం. లొంగిపోయిన వాళ్లు రాజకీయాల్లోకి వస్తామన్నా.. స్వాగతిస్తాం. కొందరు ఇప్పటికే రాజకీయాల్లోకి వచ్చి.. ప్రజా ప్రతినిధులు అయ్యారు. సీతక్క లాంటి వాళ్లు రాష్ట్ర మంత్రి కూడా అయ్యారు. కాంగ్రెస్‌లోకి వచ్చే వాళ్లు పీసీసీని కలిసి ఆసక్తి తెలియజేయవచ్చు'' అని రేవంత్ అన్నారు.

# రేవంత్ రెడ్డి కర్ణుడు కాదు.. మహా క్రూరుడు



ఈ సందర్భంగా వివిధ పార్టీల నుంచి భారీగా తరలివచ్చిన నాయకులకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.సమావేశానికి ముందు మల్కాపూర్, గోపాలరావుపల్లి గ్రామాల్లో పర్యటించిన హరీశ్ రావు.. ఎండిపోయిన పంట పొలాలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయం పండుగలా సాగిందని..నేడు రేవంత్ పాలనలో రైతులు కన్నీరు పెడుతున్నారని విమర్శించారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలన అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ అయితే.. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ విధ్వంసానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మండిపడ్డారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో, మూసీ సుందరీకరణ నెపంతో పేదల ఇళ్లను కూలగొడుతూ వారి బతుకులను ఆగం చేస్తున్నారని ఆరోపించారు. కట్టడం చేతకాని రేవంత్ రెడ్డికి కూల్చే హక్కు ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు.కర్ణుడు అంటే మాట తప్పని వాడని.. తన కవచ కుండలాలను దానం చేసిన త్యాగధనుడని పేర్కొన్నారు. కానీ రేవంత్ రెడ్డి పేదల కడుపు కొట్టే దుర్మార్గుడని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఖమ్మంలో పేదల ఇళ్లు కూల్చుతుంటే బందోబస్తుకు వెళ్లిన ఎస్సై సైతం కన్నీరు పెట్టుకున్నాడని.. ముఖ్యమంత్రికి మాత్రం కనికరం లేదని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను దారుణంగా మోసం చేశారని విమర్శించారు. కేసీఆర్ ఉన్నప్పుడు 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతు బీమా సకాలంలో అందేవని గుర్తు చేశారు. రేవంత్ సర్కార్ వచ్చాక మూడు సీజన్ల రైతుబంధు ఎగ్గొట్టి రైతులను బిచ్చగాళ్లను చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.నిజంగా ముఖ్యమంత్రి కర్ణుడివే అయితే రైతుబంధు ఎందుకు ఇవ్వడం లేదని.. ఆరు గ్యారంటీలు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డి కేవలం ఎన్నికల సమయంలోనే నిద్రలేచే కుంభకర్ణుడు అని ఎద్దేవా చేశారు. రైతులకు రుణమాఫీ జరిగిందో లేదో తెలియదనడం ముఖ్యమంత్రి హోదాకు తగదని.. ఆయన సీఎంగా ఉన్నారా లేక చప్రాసీలా మాట్లాడుతున్నారా అని ప్రశ్నించారు. కేసీఆర్ గారు గొర్రెలు, చేప పిల్లలు, దళితబంధు ఇచ్చి కులవృత్తులను ఆదుకున్నారని.. గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో బీసీల కోసం వందల గురుకులాలు ఏర్పాటు చేశారని కొనియాడారు. కాంగ్రెస్ రాగానే వాటన్నింటికీ మంగళం పాడారని ఆవేదన వ్యక్తం చేశారు.99 రోజుల ప్రణాళిక అంటూ రేవంత్ రెడ్డి కొత్త నాటకానికి తెరతీశారని.. అది బాటా చెప్పుల రేటులా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని విమర్శించారు. ప్రచారాల కోసం కేరళ పత్రికలకు కోట్లు ఖర్చు చేస్తున్నారని.. వందల కోట్లతో సీఎం క్యాంపు ఆఫీసు కట్టుకుంటున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్ల బిల్లుల కోసం రూ. 30 వేల కోట్లు విడుదల చేస్తున్న ప్రభుత్వానికి.. రైతులు, పెన్షనర్లకు ఇవ్వడానికి డబ్బులు లేవా అని ప్రశ్నించారు. దమ్ముంటే గన్‌మెన్లు లేకుండా గ్రామాల్లోకి రావాలని.. రైతులు తిరగబడటం ఖాయమని హరీశ్ రావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అవకాశాల గనిగా భారత్

## ... త్వరలోనే రివర్స్ మైగ్రేషన్




సహకార సమాఖ్య దేశంగా కేంద్రంతో, పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతున్నామని సీఎం వివరించారు. ఐటీలో భారతీయుల పరిజ్ఞానం అందరికీ తెలిసిందేనని .. డిప్లొమసి, ఫ్లెక్సిబిలిటీ విషయాల్లో వారికి మంచి పేరు ఉందని ముఖ్యమంత్రి అన్నారు. గతంలో సిలికాన్ వ్యాలీ లాంటి చోటుకు భారత్ నుంచి మేధో వలస జరిగిందని, త్వరలో రివర్స్ మైగ్రేషన్ మొదలవుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. నైపుణ్యం, వనరులు ఉన్న చోటుకే అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 60 శాతం మేర జీసీసీలు భారత్ కు వచ్చాయన్నారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి దిశగా భారత్ దూసుకెళ్తోందని తెలిపారు. భవిష్యత్తులో అనేక దేశాలకు విద్యుత్ ను భారత్ ఎగుమతి చేస్తుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

**అప్పుడు కుటుంబ నియంత్రణ-ఇప్పుడు జనాభా నిర్వహణ**

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో వృద్ధుల సంఖ్య వేగంగా పెరుగుతోందని.. ఆ ప్రమాదాన్ని గుర్తించి ముందుగానే జాగ్రత్త పడుతున్నామని సీఎం వివరించారు. భారత్ లోని దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న 1.5 ఫెర్టిలిటీ రేటును 2.1 గా తీసుకెళ్లేందుకు పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీని తీసుకువచ్చామని సీఎం తెలియచేశారు. ప్రజాప్రతినిధిగా 30 ఏళ్ల క్రితం కుటుంబ నియంత్రణ గురించి ప్రచారం చేసి ఇప్పుడు పాపులేషన్ మేనేజ్‌మెంట్ గురించి చర్చిస్తున్నామని తెలిపారు. ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉండాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న వారికి అనేక ప్రయోజనాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఏజింగ్ సమస్యను ఎదుర్కొంటున్న దేశాలు జనాభా నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు. మూడో బిడ్డ పుడితే రూ.25 వేల ఆర్థిక సాయం, నెల వారీగా రూ. వెయ్యి అందించాలని నిర్ణయించామని చెప్పారు. చైల్డ్ కేర్ లీవ్‌లాంటి ప్రోత్సాహకాలు ఆలోచిస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో గ్లోబల్ కమ్యూనిటీకి సేవలు అందించే సామర్థ్యం భారత్ కు మాత్రమే ఉందని అన్నారు. వృద్ధుల సంఖ్య పెరుగుతున్న తరుణంలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ అత్యంత కీలకమని సీఎం స్పష్టం చేశారు. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా ఇప్పుడు జనాభా వృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గతంలో ఉన్న పెద్ద కుటుంబాలు దేశానికి పెద్ద ఆస్తి అని.. ప్రస్తుతం అవి మైక్రో ఫ్యామిలీలు గా మారాయన్నారు.

ఈ విషయంలో ప్రజల దృష్టి కోణం మార్చాలన్న ప్రయత్నంలో ఉన్నామని ముఖ్యమంత్రి వివరించారు.

**అమరావతిలో గ్లోబల్ లీడర్షిప్ సెంటర్**

విభిన్నంగా ఆలోచన చేసే వారి కోసం అమరావతిలో క్రియేటివ్ సిటీ నిర్మిస్తున్నామని.. డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ సిటీలను కూడా నిర్మిస్తున్నామని అన్నారు. సమీప భవిష్యత్తులో ఆరోగ్య రంగంలో పెనుమార్పులు రానున్నాయని.. గతంలో ఊహగానే ఉన్న డ్రోన్ అంబులెన్సులు కూడా రియాలిటీలోకి వచ్చేశాయన్నారు. ఏఐ డేటా సెంటర్లతో ఏపీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ డెస్టినేషన్ గా ఏపీ తయారవుతుందని అన్నారు. మెరుగైన సదుపాయాలతో వ్యాపార అనుకూల ప్రాంతంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దామని.. పెట్టుబడులతో వస్తే జాప్యం లేకుండా అనుమతులు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. అమరావతిలో గ్లోబల్ లీడర్షిప్ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నామని సీఎం వివరించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ సహా 110 దేశాల నుంచి 2700 మందికి పైగా ప్రతినిధులు, మేధావులు, నిపుణులు, వ్యూహకర్తలు హాజరయ్యారు. 2016 నుంచి జరుగుతున్న ప్రతిష్టాత్మక రైసినా డైలాగ్ సదస్సుకు తొలిసారిగా ఓ రాష్ట్ర ముఖ్యమంత్రికి నిర్వాహకులు ఆహ్వానం పలికారు. వారి ఆహ్వానం మేరకు సీఎం చంద్రబాబు ఈ రైసినా డైలాగ్ కు హాజరై తన అభిప్రాయాలను వివరించారు.

## బెంగాల్ పర్యటనలో ప్రొటోకాల్ వైఫల్యం

### ..రాష్ట్రపతి అసహనం



అనుమతి నిరాకరించిందని తెలిపారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన తనకు సీఎం నుంచి గానీ.. మంత్రుల నుంచి గానీ అధికారిక స్వాగతం లభించలేదని పేర్కొన్నారు. తాను ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిన ఆదివాసీ సదస్సుకు అనుమతి ఇవ్వకపోవడాన్ని ప్రశ్నించారు. అయినప్పటికీ మమత ప్రభుత్వంపై ఎటువంటి ద్వేషం లేదని..ఆమె తనకు సోదరితో సమానమని అన్నారు. 9వ అంతర్జాతీయ సంతాల్ సదస్సులో ప్రసంగించడానికి రాష్ట్రపతి బెంగాల్‌లోని సిలిగుడికి వెళ్లారు. ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్రానికి వచ్చిన రాష్ట్రపతికి ముఖ్యమంత్రి గానీ ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు గానీ స్వాగతం పలకాల్సి ఉంటుంది. అయితే అధికారికంగా స్వాగతించడానికి ప్రభుత్వం తరఫున ఎవరూ రాకపోవడం గమనార్హం. ఇదీ చదవండి: నిరుద్యోగులకు నెలకు రూ.1500: మమతా బెనర్జీ

––బెంగాల్ సర్కారు అన్ని హద్దులు దాటింది: ప్రధాని మోదీ

ఈ వ్యవహారంపై ప్రధాని మోదీ స్పందించారు. రాష్ట్రపతిని బెంగాల్ ప్రభుత్వం అవమానించిందని ఆరోపించారు. ఇది అసాధారణ ఘటన అని, తృణమూల్ కాంగ్రెస్ సర్కారు అన్ని హద్దులు దాటిందని విమర్శించారు. రాష్ట్రపతి పదవి రాజకీయాలకు అతీతమైనదని, దాని పవిత్రతను ఎల్లప్పుడూ గౌరవించాలన్నారు. సంతాల్ సంస్కృతి వంటి ముఖ్యమైన అంశాన్ని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం చాలా తేలికగా తీసుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

# ఇరాన్ బిగ్ యూటర్న్..!



.గల్ఫ్, మిడిల్ ఈస్ట్ లోని ఏ దేశంపైనా ఇకపై క్షిపణి దాడులు జరపకూడదని, వీటిని తక్షణమే నిలిపివేయాలని కౌన్సిల్ లో నిర్ణయం తీసుకున్నట్లు పెజాష్కియన్ ప్రకటించారు. ఆయా దేశాలు తమపై మిస్సైళ్లు సంధిస్తే తప్ప, తాము దాడి చేయబోమనీ తేల్చి చెప్పారు. కౌన్సిల్ తీసుకున్న కొన్ని కీలక నిర్ణయాలను ఆయన ఈ సందర్భంగా దేశ ప్రజలకు వివరించారు. ఇటీవల దాడుల వల్ల ప్రభావితమైన ఆయా గల్ఫ్ దేశాలకు అండగా నిలవాలని కూడా నిర్ణయించామని చెప్పారు.తమపై దాడి చేయడం వల్ల ప్రాంతీయ అశాంతి ఏర్పడుతుందని, అందుకే ఈ విషయంలో తుది నిర్ణయాన్ని తీసుకోవాల్సింది అక్కడి దేశాలేనని పెజెష్కియన్ పిలుపునిచ్చారు. అమెరికా, ఇజ్రాయెల్ ఇటీవల దాడులు జరిపిన నేపథ్యంలోనే ఇరాన్ సైతం గల్ఫ్ లోని దాదాపుగా అన్ని దేశాలపైనా ఎదురు దాడులు కొనసాగిస్తూ వస్తోంది. దీనివల్ల మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తీవ్రతరం అయ్యాయి. ఆయా దేశాల్లోని అమెరికా బేస్ లు, ఎంబసీలు, రాయబార కార్యాలయాలపై మాత్రమే దాడులు చేశామని పెజాష్కియన్ వివరించారు.ఇవి అమెరికా, ఇజ్రాయెల్ దూకుడు చర్యలకు ప్రతీకారంగానే అభివర్ణించారు. షరతులు లేని లొంగుబాటును అంగీకరించాలనే అమెరికా డిమాండ్‌ను కూడా పెజెష్కియన్ కొట్టిపారేశారు. షరతులు లేకుండా లొంగిపోతామనే వారి కలలను వారు సమాధి చేస్తామని వ్యాఖ్యానించారు. ఈ ప్రకటన ద్వారా టెహ్రాన్ తన పొరుగు దేశాలకు భరోసా ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, ప్రాంతీయ సంఘర్షణ మధ్య అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా కఠినమైన వైఖరిని కొనసాగిస్తున్నామనే విషయాన్ని స్పష్టం చేసినట్టయింది. ఇరాన్ పై అమెరికాఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధం ఎనిమిది రోజులకు చేరుకుంది. అయినా ఇప్పట్లో ఫలితం తేలేలా కనిపించడం లేదు. మరోవైపు ఇజ్రాయెల్అమెరికాతో పోలిస్తే ఎక్కువ దెబ్బలు గల్ఫ్ దేశాలకు తగులుతున్నాయి. ఇన్నాళ్లూ సైలెంట్ గా అమెరికా మద్దతుగా నెట్టుకొస్తున్న గల్ఫ్ దేశాలకు ఇప్పుడు ఇరాన్ రూపంలో అసలైన ప్రత్యర్థి ఎదురుకావడంతో ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.ఇరాన్ ఓవైపు తమ దేశాల్లోని అమెరికా బేస్ లతో ప్రారంభించి చమురు క్షేత్రాల వరకూ దాడులు చేస్తున్నా కిమ్మనలేని దుస్థితిలోకి గల్ఫ్ దేశాలు చేరుకున్నాయి. దీంతో రోజురోజుకీ గల్ఫ్ దేశాల్లో ఉన్న పౌరుల పరిస్థితి దినదినగండంగా మారుతోంది. అలాగని ఇరాన్ పై ఎదురుదాడి చేయలేని పరిస్థితుల్లో అవి ఉన్నాయి. దీంతో ఇప్పుడు ఇరాన్ మిస్సైళ్లను అడ్డుకునే ఇంటర్ సెప్టర్లను వాడుకోవడం మినహా ఏమీ చేయలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా కీలక మిత్రదేశం సౌదీ అరేబియా కీలక నిర్ణయం తీసుకుంది.మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని నియంత్రించడానికి సౌదీ అరేబియా ఇరాన్‌తో నేరుగా సంప్రదింపులను ప్రారంభించింది. ఈ యుద్ధం ఉధృతం కావడం ప్రపంచ మార్కెట్లపై ఒత్తిడి పెంచుతోందని యూరోపియన్ అధికారులు చెప్తున్నారు. దీంతో యూరప్ జోక్యంతో సౌదీ ప్రభుత్వం ఇరాన్ తో తెరవెనుక చర్చలు జరుపుతోంది. ఉద్రిక్తతలను తగ్గించి, సంఘర్షణ తీవ్రం కాకుండా నిరోధించేందుకు సౌదీ అధికారులు తాజాగా తమ దౌత్య గోప్య మార్గాన్ని మరింత అత్యవసరంగా ఉపయోగించారని తెలుస్తోంది. భద్రతా సంస్థలు, దౌత్యవేత్తలు ఈ చర్చలలో పాలుపంచుకున్నారు. ఈ ప్రయత్నాలకు పలు యూరోపియన్, మధ్యప్రాచ్య దేశాలు మద్దతు ఇస్తున్నాయని అధికారులు తెలిపారు. అయితే, చర్చలలో ఉన్నత స్థాయి అధికారులు పాల్గొన్నారా అనేది తెలియలేదు. ఇరాన్ అమెరికా లేదా ఇజ్రాయెల్‌తో చర్చలు జరిపేందుకు ఇప్పటివరకు ఆసక్తి చూపలేదు. ఫిబ్రవరి 28న ప్రారంభమైన అమెరికాఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా, ఇరాన్ కూడా క్షిపణి, డ్రోన్ దాడులతో బదులిచ్చింది. అయితే తమపై ప్రతీకారం వద్దని గల్ఫ్ దేశాలు ఇరాన్‌ను కోరాయి. సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్ వంటి దేశాలు ఇరాన్‌పై అమెరికా లేదా ఇజ్రాయెల్ సైనిక దాడులకు తమ భూభాగాన్ని, గగనతలాన్ని ఉపయోగించకూడదని స్పష్టం చేశాయి. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం కొనసాగుతుందని బహిరంగంగా ప్రకటించగా, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టెహ్రాన్ "బేషరతు లొంగుబాటు"ను మాత్రమే అంగీకరిస్తానని తాజాగా తెలిపారు. ఇరాన్, ఇజ్రాయెల్ అమెరికా మధ్య యుద్ధం ప్రారంభమై వారం రోజులు దాటినా ఈ దేశాల్లో దాడులు ఇంకా కొనసాగుతున్నాయి. తాజాగా ఇరాన్ పై ఇజ్రాయెల్అమెరికా దళాల యుద్ధం ఎనిమిదో రోజుకు చేరింది. మార్చి 7 తెల్లవారుజామున ఇజ్రాయెల్ విస్తృత దాడులను చేపట్టింది. ఇరాన్, లెబనాన్ రాజధానులపై బాంబు దాడులు చేసింది. ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.ఇరాన్ తో దాడుల వేళ సౌదీ అరేబియాలో పాకిస్థాన్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ కీలక పర్యటన చేపట్టారు. ఈ మేరకు సౌదీ అరేబియాకు వ్యూహాత్మక మద్దతు తెలిపింది పాకిస్థాన్. ఈ మేరకు సౌదీ రక్షణ మంత్రి ఖలీద్ బిన్ సల్మాన్ తో అసిమ్ మునీర్ కీలక భేటీ నిర్వహించారు. ఈ సమావేశం సౌదీ అరేబియా రాజధాని రియాద్ లో జరిగింది. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులను ఉద్ధృతం చేసిన వేళ పాకిస్థాన్ సౌదీ అరేబియా మధ్య ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో సౌదీపై ఇరాన్ జరిపిన దాడులపై చర్చించారు. దాడులకు ప్రతిగా ఎలాంటి ప్రతీకార చర్యలు తీసుకోవాలన్నదానిపైనా చర్చించినట్లు తెలుస్తోంది. ఈ దాడులను నిలిపివేసి స్థానికంగా స్టెబిలిటీపై చర్చలు నిర్వహించినట్లు సౌదీ డిఫెన్స్ మంత్రి ఖలీద్ బిన్ సల్మాన్ పేర్కొన్నారు. పాకిస్థాన్ తో ఉన్న జాయింట్ స్ట్రాటెజిక్ డిఫెన్స్ అగ్రీమెంట్ లో భాగంగా ఇరాన్ పై ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్నదానిపై చర్చించినట్లు స్పష్టం చేశారు. ఇరాన్ చర్యలు సౌదీ సరిహద్దులో భయభ్రాంతులకు గురి చేశాయని అన్నారు.ఈ మేరకు సౌదీ అరేబియాకు ఫుల్ సపోర్ట్ ను ఇచ్చేందుకు పాకిస్థాన్ సిద్ధంగా ఉన్నట్లు అసిమ్ మునీర్ పేర్కొన్నట్లు సమాచారం. సౌదీకు రక్షణ, వ్యూహాత్మకంగా మద్దతు ఇచ్చేందుకు రెడీగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మిడిల్ ఈస్ట్ దేశాల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో సౌదీ పాకిస్థాన్ మధ్య జాయింట్ మిలిటరీ కో ఆర్డినేషన్ అండ్ ఆపరేషనల్ ఫ్రేమ్ వర్క్స్ అవసరం అని అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం.ఇక పాకిస్థాన్ సౌదీ అరేబియా 2025 లో భారీ రక్షణ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం ఏదైనా దేశం పాకిస్థాన్ పై లేదా సౌదీ అరేబియా పై దాడులకు పాల్పడితే ఇరు దేశాలపైనా దాడులకు పాల్పడినట్లుగా భావిస్తాయి. మరోవైపు సౌదీ అరేబియాపై ఇరాన్ దాడులకు పాల్పడుతోంది. తాజాగా ఇరాన్ నుంచి సౌదీలోని ఎంటీ క్వార్టర్ ఎడారి ప్రాంతంలోకి దూసుకొచ్చిన నాలుగు డ్రోన్ లను పేల్చేసినట్లు సౌదీ డిఫెన్స్ శాఖ వెల్లడించింది.మరోవైపు ఆఫ్ఘానిస్తాన్ పాకిస్థాన్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. పాకిస్థాన్ డిఫెన్స్ మంత్రి ఈ యుద్ధాన్ని ఓపెన్ వార్ అని అభివర్ణించారు.

## నేపాల్ ప్రధాని పీఠానికి చేరువలో

# మాజీ ర్యాపర్!



ఎప్పుడూ నలుపు కళ్లజోడులో కనిపించే ఈయన ఓ ర్యాపర్ కూడా. మొదట నేపాలీ హిప్‌హాప్‌లో ఫేమస్ అయిన బాలేంద్ర.. దేశంలో అస్థిర రాజకీయాలనీ, అవినీతినీ విమర్శిస్తూ పాడిన కవితలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. కొన్నేళ్లలోనే యూత్ ఐకాన్‌గా మారారు. ఈ క్రమంలో 2022లో కాఠ్‌మాండూ మేయర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి.. ప్రధాన పార్టీలు, కీలక నేతలను ఓడించి యావత్ దేశాన్ని ఆశ్చర్యపరిచారు.

--దూకుడుగా వ్యవహరించి..

మేయర్‌గా దాదాపు మూడున్నరేళ్ల కాలంలోనే రాజధానిలో అనేక సంస్కరణలు చేపట్టారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశాలు నిర్వహించడం, అక్రమ కట్టడాలపై కఠినంగా వ్యవహరించడం, ప్రభుత్వ భూములను రక్షించడం, వ్యర్థాల నిర్వహణ వంటి చర్యలతో దూకుడుగా వ్యవహరించారు. ఈ క్రమంలో గతేడాది సెప్టెంబర్‌లో దేశంలో అవినీతి, సామాజిక మాధ్యమాలపై ఆంక్షలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో కీలక పాత్ర పోషించారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించారు.

--కొత్త పార్టీలో చేరి..

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రెండు నెలల క్రితం కాఠ్‌మాండూ మేయర్ పదవికి రాజీనామా చేసిన బాలేంద్ర షా.. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్పీ)లో చేరారు. మాజీ టీవీ హోస్ట్ రవి లామిచానే సారథ్యంలో 2022లో ఈ పార్టీ ఏర్పాటైంది. ప్రధాన మంత్రి అభ్యర్థిగా బాలేంద్రను ఈ పార్టీ ఎన్నికల బరిలో దించింది. భావోద్వేగ ప్రసంగాలతో కాకుండా.. పొరుగు దేశాలతో స్థిరమైన వాణిజ్యం, ఉపాధి అవకాశాలు, ఇంధన ఒప్పందాలు తదితర అంశాలనే ఎన్నికల్లో విస్తృత ప్రచారం చేశారు. నాలుగు సార్లు ప్రధాని పదవి చేపట్టిన కేపీ శర్మ ఓలి నియోజకవర్గం ఝాపా 5 నుంచి పోటీ చేసిన బాలేంద్ర 49వేల మెజార్టీతో విజయం సాధించారు. దేశ పార్లమెంటులోని ప్రజా ప్రతినిధుల సభలో మొత్తం 275 స్థానాలుండగా వాటిలో 165 స్థానాలకు ప్రత్యక్ష ప్రాతిపదికన ఓటింగు జరిగింది. 110 స్థానాలకు దామాషా ప్రాతిపదికన ఎన్నిక నిర్వహించారు. ఇప్పటివరకు 78 స్థానాల్లో ఫలితం తేలగా 62 చోట్ల ఆర్ఎస్పీ విజయం సాధించింది. ఒక్క కాఠ్‌మాండూలోనే 10 నియోజకవర్గాలను కైవసం చేసుకుంది. దాదాపు 60 స్థానాల్లో ముందంజలో ఉన్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.

# మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నాం ... రేవంత్‌రెడ్డి

ఈ కబురు, హైదరాబాద్:
మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. "మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నాం. వారు ఆర్థికంగా బలపడాలనే ఆలోచనతోనే మహిళాశక్తి పథకం తీసుకొచ్చాం. మహిళలపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉంది. వారి ప్రాధాన్యం గుర్తించి పార్టీలో పదవులు ఇస్తున్నాం. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలే యజమానులు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోంది. సోషల్ మీడియాలో మహిళలను వేధించే ఘటనలు తాజాగా పెరుగుతున్నాయి. వాటిని కట్టడి చేయాలి " అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ సజ్జనార్, సినీ నటుడు సాయి దుర్గతేజ్ తదితరులు పాల్గొన్నారు.



# వచ్చే ఏడాది నుంచి వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీ

ఈ కబురు,హైదరాబాద్ ;
వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించిన సబ్సిడీ నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసే విధానాన్ని అమలు చేసే అవకాశాలను పరిశీలించి, అవసరమైన విధివిధానాలను రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా రైతులు కొనుగోళ్లు చేసిన పనిముట్లకు 40 శాతం సబ్సిడీ నిధులను సదరు కంపెనీలకు అందించే పద్ధతి ఉంది అలా కాక, వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి సబ్సిడీ నిధులను నేరుగా రైతుల ఖాతాలోకి బదిలీ చేసే అవకాశాలను పరిశీలించి అందుకు తగ్గ విధివిదానాలను తయారు చేయాలన్నారు. రాష్ట్రంలో రైతులకు సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను వచ్చే ఏప్రిల్ నెలాఖరు సిద్దంగా ఉంచుకోవాలని అందుకు తగ్గ ఏర్పాట్లు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు వేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని, ఇందుకు రెడ్కో సంస్థ సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించారు. మొదట ప్రయోగాత్మకంగా జంగారెడ్డిపల్లి మరియు జనంపేట రైతు వేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి వాటి పనితీరును పరిశీలించిన తరువాత మొదటి దశలో రాష్ట్రంలోని 1600 రైతు వేదికలలో రెడ్కో ద్వారా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రానికి అవసరమైన ఎరువులను ముందుగానే తెప్పించి నిల్వ ఉంచేందుకు ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించాలని మంత్రి అధికారులకు సూచించారు. ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన కూడ ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్రానికి అవసరమైన ఎరువులను ముందుగానే సమకూర్చుకోవాలని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో వరి, పత్తి, మక్క వంటి ప్రధాన పంటల సాగు విస్తృతంగా జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా మక్క పంటకు వరి లేదా పత్తి పంటలతో పోలిస్తే యూరియా అవసరం దాదాపు మూడింతలు ఎక్కువగా ఉంటుందని చెప్పారు. నీటి నిల్వలు సమృద్ధిగా ఉండటం, నేలలో తేమ నిల్వ ఉండటం, అలాగే దక్షిణ పశ్చిమ రుతుపవనాలు సాధారణంగా ప్రారంభమవుతాయనే అంచనాల నేపథ్యంలో రానున్న ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం సుమారు 60.60 లక్షల హెక్టార్లలో సాగు అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్-2026 సీజన్‌కు రాష్ట్రానికి 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు.

## హైదరాబాద్ నగరాన్ని

# క్లీన్ సిటీగా మార్చండి



ఉన్నతాధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. నగర జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే పారిశుధ్య నిర్వహణలో విప్లవాత్మక మార్పులు రావాలని సీఎం అభిప్రాయపడ్డారు. నగరంలో ప్రతిరోజూ వంద శాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాల్సిందేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. చెత్త సేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకూడదని హెచ్చరించారు. పారిశుధ్య పనుల కోసం పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెద్దపీట వేయాలని అధికారులకు సూచించారు. ఒక్కో వాహనానికి నిర్దిష్ట ఏరియాను కేటాయించి పర్యవేక్షించడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. చెత్త సేకరణ వ్యవస్థ నిరంతరం నిఘాలో ఉండాలని అధికారులకు తెలిపారు.హైదరాబాద్ నగరం శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డులపై ఒత్తిడి పెరుగుతోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందుకే గతంలో గుర్తించిన కొత్త డంపింగ్ యార్డులను వీలైనంత త్వరగా సిద్ధం చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్పొరేషన్ల వారీగా సమీపంలోని డంపింగ్ యార్డులకు చెత్తను వేగంగా తరలించేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. దీనివల్ల రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుందని సీఎం వివరించారు.నగరంలో నిర్మాణ వ్యర్థాల (C&D Waste) నిర్వహణపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. రోడ్ల పక్కన ఖాళీ ప్రదేశాల్లో నిర్మాణ వ్యర్థాలను పడేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రై మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో నిర్మాణ వ్యర్థాల తరలింపు కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. నగరం ఎక్కడా అపరిశుభ్రంగా కనిపించకుండా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులను కోరారు.వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున దోమల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. నగరవాసులకు మెరుగైన వైద్యం నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డితో సహా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మరికొందరు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన భారీ అవినీతి తిమింగలం

ఈ కబురు, కరీంనగర్: భారీ అవినీతి తిమింగలం ఏసీబీ అధికారుల వలకు చిక్కింది. తహసీల్దార్‌గా పని చేస్తూ భారీగా ఆస్తులు కూడబెట్టుకున్న అధికారిని అవినీతి నిరోధకశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల తహసీల్దార్‌గా పని చేస్తున్న కమతం శ్రవణ్‌కుమార్, ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారనే ఆరోపణలపై కరీంనగర్‌లోని హిందూపూర్ కాలనీలోని ఆయన ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. నిందితుడి నివాసంతో పాటు మరో 2 ప్రదేశాల్లో సోదాలు చేపట్టారు. పలు విలువైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పత్రాలు, బంగారు ఆభరణాలు, నగదు విలువ సుమారు రూ.4 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయని, నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.



## కామారెడ్డిలో కలకలం

## .. రెండు రోజుల్లో ఐదుగురు చిన్నారుల అదృశ్యం




ఈ కబురు, కామారెడ్డి : కామారెడ్డిలో చిన్నారుల అదృశ్యం కలకలం రేపుతోంది. శుక్రవారం ఇద్దరు చిన్నారులు అదృశ్యం కాగా, ఇవాళ మరో ముగ్గురు చిన్నారులు కనిపించడం లేదు. కామారెడ్డి పట్టణంలోని గోసంగి కాలనీకి చెందిన సింహాద్రి (10), విజయ్ (9) శుక్రవారం అదృశ్యం కాగా.. శనివారం ఆర్‌బీనగర్ కాలనీకి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు సీపాత్ (8), ఆయాత్ (7), మరియం (5) అదృశ్యమయ్యారు. ఇవాళ ఉదయం ఇంటి నుంచి తండ్రితో కలిసి ముగ్గురు చిన్నారులు ఆటోలో వెళ్లారు. పిల్లల్ని షాపు వద్ద దింపేసి తాను కిరాయికి వెళ్లినట్లు తండ్రి చెబుతున్నాడు. మొత్తం ఐదుగురు పిల్లలు కనిపించకుండా పోవడంతో తల్లిండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. కామారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కామారెడ్డి అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, కామారెడ్డి పట్టణ సీఐ నరహరి, కామారెడ్డి రూరల్ సీఐ రామన్ ఆధ్వర్యంలో పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఎవరికైనా అదృశ్యమైన పిల్లల ఆచూకీ కనిపిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

## మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నాం ... రేవంత్‌రెడ్డి



ఈ కబురు, హైదరాబాద్:
మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. "మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నాం. వారు ఆర్థికంగా బలపడాలనే ఆలోచనతోనే మహిళాశక్తి పథకం తీసుకొచ్చాం. మహిళలపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉంది. వారి ప్రాధాన్యం గుర్తించి పార్టీలో పదవులు ఇస్తున్నాం. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలే యజమానులు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోంది. సోషల్ మీడియాలో మహిళలను వేధించే ఘటనలు తాజాగా పెరుగుతున్నాయి. వాటిని కట్టడి చేయాలి " అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ సజ్జనార్, సినీ నటుడు సాయి దుర్గతేజ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.6వేల కోట్లు: సుందర్ పిచాయ్ వేతన ప్యాకేజీని పెంచిన గూగుల్




గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ వేతన ప్యాకేజీ భారీగా పెరిగింది. రానున్న మూడేళ్ల కాలానికి ఆ మొత్తాన్ని 692 మిలియన్ డాలర్లకు పెంచుతూ గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ నిర్ణయం తీసుకుంది. అంటే భారత కరెన్సీలో అక్షరాలా రూ.6,361కోట్లు. ఈ మేరకు ఫైనాన్షియల్ టైమ్స్ కథనం వెల్లడించింది.
ఈ వేతన ప్యాకేజీలో వార్షిక జీతం 2 మిలియన్ డాలర్లు కాగా.. పెర్ఫార్మెన్స్ స్టాక్ యూనిట్ (PSU) విలువ 126 మిలియన్ డాలర్లుగా నిర్ణయించారు. కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకున్నదాని ఆధారంగా ఈ మొత్తం సర్దుబాటు అవుతుంది. పరిమిత స్టాక్ వెస్టింగ్ ద్వారా 84 మిలియన్ల డాలర్లను అందుకుంటారు. పరిమిత స్టాక్ వెస్టింగ్ అంటే.. కంపెనీ ఉద్యోగికి మంజూరు చేసే షేర్లు. పదవీకాలం పూర్తయిన లేదా పనితీరు ఆధారంగా ఇవి ఉద్యోగికి బదిలీ అవుతుంటాయి. అలాగే ఆల్ఫాబెట్ అనుబంధ సంస్థలు వ్యోమో, వింగ్ ఏవియేషన్లలో 175 మిలియన్ డాలర్ల విలువైన షేర్లను కేటాయించారు. ఈ రెండు సంస్థలకు సుందర్ పిచాయ్ నాయకత్వంపై ఉన్న విశ్వాసానికి ఈ ప్రోత్సాహకాలు నిదర్శనమని ఆల్ఫాబెట్ బోర్డు వెల్లడించింది. ఏఐతో టెక్ ప్రపంచం వేగంగా మారుతున్న క్రమంలో పిచాయ్‌పై బలమైన నమ్మకంతో కంపెనీ ఈ వేతన పెంపును ప్రకటించింది.
2004లో గూగుల్ (Google)లో చేరిన సుందర్ పిచాయ్.. 2015లో సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ దశాబ్దకాలంలో ఆ సంస్థ మార్కెట్ విలువ ఏడు రెట్లు పెరిగింది. 535 బిలియన్ డాలర్ల నుంచి 3.6 ట్రిలియన్ డాలర్లకు చేరింది. ఈ జనవరిలో ఒక దశలో 4 ట్రిలియన్ల డాలర్ల మార్క్‌ను తాకింది.

## అమెరికాతో ఉత్తమ వాణిజ్య ఒప్పందం



దిల్లీ: పోటీ దేశాలతో పోలిస్తే మన దేశం అమెరికాతో ఉత్తమ వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుందని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ శనివారం తెలిపారు. ఇరు దేశాలు శక్తిమంతమైన సంబంధాన్ని పంచుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ (30 లక్షల కోట్ల డాలర్లు) అయిన అమెరికాను ఎవరూ దూరం చేసుకోలేరని వెల్లడించారు. 'ఇది ఒక అద్భుతమైన ప్రయాణం. రెండు దేశాల మధ్య ఉత్తమ సంబంధాలు ఉన్నాయి. గత ఏడాది నుంచి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మన దేశం గురించి, ప్రధాని మోదీ గురించి ఉత్తమమైన విషయాలనే చెప్పారని గమనించే ఉంటారు. అక్కడి మా సహచరులతోనూ మంచి సంబంధాలు ఉన్నాయ'ని పీయూష్ తెలిపారు. 'కుటుంబంలో కూడా కొన్నిసార్లు అపార్థాలు రావొచ్చు. అలాగే అమెరికాభారత్ వాణిజ్య ఒప్పందంపై కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. అయితే మిగతా పోటీ దేశాలతో పోలిస్తే మనకు ఉత్తమమైన ఒప్పందం కుదిరింది. రెండు దేశాల మధ్య శక్తిమంతమైన సంబంధం ఏర్పడింద'ని రాయ్‌సీనా డైలాగ్ 2026 కార్యక్రమంలో పాల్గొన్న ఆయన వివరించారు.

# దుబాయ్‌లో బంగారంపై రాయితీ



పండగలుప్రత్యేక సందర్భాల్లో సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, దుస్తుల వంటివి రాయితీపై అమ్మడం చూస్తుంటాం. అయితే ఇరాన్ యుద్ధం ఫలితంగా విమానాలు నౌకా రవాణాకు ఆటంకం ఏర్పడిన నేపథ్యంలో, దుబాయ్‌లో బంగారాన్ని కూడా రాయితీపై అమ్మేస్తున్నారు. అధిక వ్యయాలకు తోడు డెలివరీల్లో అనిశ్చితి వల్ల కొనుగోలుదార్లు వెనుకడుగు వేస్తుండటమే ఈ పరిస్థితికి కారణం. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధరపై 30 డాలర్ల (రూ.2,700కు పైగా) వరకు తక్కువకే ఇచ్చేస్తున్నారని సమాచారం. దుబాయ్ నుంచి కొన్ని బంగారం డెలివరీలు అవుతున్నా, మరికొన్ని ఆలస్యం అవుతున్నాయి. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర శుక్రవారం 5147 డాలర్ల వద్ద ఉంది.

ఇవీ కారణాలు

అంతర్జాతీయంగా లోహం రూపంలో బంగారం వ్యాపారానికి దుబాయ్ కేంద్రంగా ఉంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్అమెరికా యుద్ధం నేపథ్యంలో, గల్ఫ్ దేశాల్లోనూ దాడులు చోటుచేసుకుంటున్నాయి. ఫలితంగా విమాన సర్వీసులు అరకొరగా నడుస్తున్నాయి. అందువల్ల దుబాయ్ నుంచి బంగారాన్ని వివిధ దేశాలకు డెలివరీ చేయడానికి ఆటంకాలేర్పడుతున్నాయి. ఫలితంగా కొత్త ఆర్డర్లు ఇచ్చేందుకు కొనుగోలుదార్లు (బులియన్ వ్యాపారులు/సంస్థలు) ముందుకు రావడం లేదు. డెలివరీ వ్యయాలు బీమా ఖర్చులు గణనీయంగా పెరగడంతో పాటు, సమయానికి సరకు చేరుతుందన్న నమ్మకం కొరవడటమే ఇందుకు కారణం. బంగారంపై పెట్టిన పెట్టుబడులను దీర్ఘకాలం వృథాగా ఉంచడం ఇష్టం లేకే, దుబాయ్ వ్యాపారులు అంతర్జాతీయ ధర కంటే తక్కువకే అమ్మేందుకు సుముఖత చూపుతున్నారు. ఈ వారంలో కొన్ని డెలివరీలు తరలిపోయినా, శుక్రవారం కూడా పెద్ద మొత్తంలో నిల్వలు దుబాయ్‌లో ఉండిపోయినట్లు సమాచారం.

పసిడి తరలింపు ఇలా

ప్రయాణికుల విమానాల్లోనే సరకు తరలింపునకు ఉండే చోటులోనే, సురక్షితంగా పసిడిని కూడా పంపుతుంటారు. యూఏఈ విమానాల రాకపోకలకు తీవ్ర అవరోధం ఏర్పడుతున్నా కూడా, సౌదీ అరేబియా ఒమన్ దేశాల విమానాశ్రయాలకు పంపి, అక్కడ నుంచి వివిధ దేశాలకు బంగారం తరలించేందుకు ట్రేడర్లు రవాణా సంస్థలు విముఖత చూపుతున్నాయి. బంగారం ధర ఔన్సు 5,100 డాలర్లకు మించి ఉన్న నేపథ్యంలో, దేశాల సరిహద్దులను దాటించేందుకు అవరోధాలు ఏర్పడుతుండటమే ఇందుకు కారణం.

దేశీయంగా గిరాకీ అరకొరగానే

యూఏఈ నుంచి డెలివరీలు స్తంభించడం లేదా ఆలస్యం అవుతున్నాయి. ఇందువల్ల స్వల్పకాలానికి మనదేశానికి వచ్చే బంగారం తక్కువగానే ఉంటుందని పరిశోధనా సంస్థ ఆగ్‌మాంట్ ఎంటర్‌ప్రైజెస్ అధిపతి రెనీషా ఛైనాని తెలిపారు. ప్రస్తుతం దేశీయంగా పసిడికి గిరాకీ అంతంతమాత్రంగానే ఉన్నందున, మనదేశం నుంచి ఆర్డర్లు పెట్టినవారు కూడా వేచిచూసేందుకు ఇబ్బందులు లేవని పేర్కొన్నారు. జనవరిలో అధికంగా బంగారం దేశంలోకి దిగుమతి అయినందున, తగినన్ని నిల్వలు ఉన్నాయని వివరించారు. గనుల నుంచి పసిడి రిఫైనరీలకు వచ్చే ముడి బంగారం లభ్యత తగ్గుతోంది. దేశీయ అతిపెద్ద లోహ రిఫైనరీ ఎంఎంటీసీపాంప్‌నకు పశ్చిమాసియా గనుల నుంచి 10% బంగారం దొరె వస్తుంటుంది. ఇందులోనూ ఆటంకాలు ఏర్పడుతున్నాయి. యుద్ధం ప్రారంభమయ్యాక, ఇతర ప్రాంతాల నుంచి సరఫరా వ్యయాలు కూడా 6070% అధికమయ్యాయని ఎంఎంటీసీపాంప్ ఎండీ సుమిత్ గుహ వెల్లడించారు.

మేలిమి పుత్తడికి ప్రసిద్ధి

గనుల నుంచి వచ్చిన పసిడిని శుద్ధి చేసి, మేలిమి బంగారం రూపంలో ఆసియా దేశాలకు ఎగుమతి చేయడంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రధాన కేంద్రంగా ఉంది. స్విట్జర్లాండ్ నుంచి యునైటెడ్ కింగ్‌డమ్, ఆఫ్రికా దేశాలకు కూడా యూఏఈ మీదుగానే పసిడి రవాణా అవుతోంది. ఇరాన్ క్షిపణులు ప్రయోగిస్తున్నందున, దుబాయ్ గగనతలాన్ని కూడా పాక్షికంగా మూసివేయడంతో, విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడుతోంది. చిక్కుకుపోయిన ప్రయాణికులను తీసుకెళ్లేందుకు భారత్ నుంచి కూడా ప్రత్యేక విమాన సర్వీసులను నిర్వహిస్తున్న సంగతి విదితమే.

## 10 ఏళ్లలో జీడీపీకి రూ.40 లక్షల కోట్లు చేర్చాలంటే..



దీర్ఘకాలిక ఆర్థిక పెట్టుబడుల్లో మహిళా ప్రాతినిధ్యం పెరిగితే.. రాబోయే 10 ఏళ్ల కాలంలో వీళ్ల పెట్టుబడులు దేశ జీడీపీకి సుమారు రూ.40 లక్షల కోట్లను జతచేస్తాయని ఓ నివేదిక తెలిపింది. మహిళల వద్ద నిరుపయోగంగా ఉన్న పొదుపు మొత్తాన్ని ఉత్పాదకత, వృద్ధి ఆధారిత మూలధనం వైపు మళ్లించినప్పుడు ఈ ప్రభావం కనిపిస్తుందని తెలిపింది. ఎల్ఎక్స్ఎంఈ, ఈవై సంయుక్తంగా ఈ నివేదికను రూపొందించాయి. ఇందులో వివరాలు ఇలా..
అందరికీ ఆర్థిక సేవలను దరిచేర్చడం ద్వారా కలిగే ప్రధాన ప్రయోజనాలను పూర్తి స్థాయిలో పొందే విషయంలో మహిళలు ఇంకా దూరంగానే ఉన్నారని నివేదిక గుర్తించింది. బ్యాంకుల్లో మహిళల ఖాతాలు 2011లోని 26 శాతం నుంచి 2024లో 89 శాతానికి పెరిగినప్పటికీ.. వీటిని పొదుపు కోసం కంటే కూడా ప్రభుత్వ పథకాల నగదు బదిలీ, నగదు ఉపసంహరణ కోసం ఎక్కువగా వాడుతున్నారని తెలిపింది. పదవీ విరమణానంతర సొమ్ము విషయంలోనూ భారత్‌లో పురుషుల, మహిళల మధ్య వ్యత్యాస నిష్పత్తి 40 శాతంగా ఉందని పేర్కొంది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ నిష్పత్తి 26 శాతమేనని వివరించింది.
వృద్ధి ఆధారిత ఆర్థిక పథకాల్లో మహిళల ప్రాతినిధ్యం పరిమితంగానే ఉందని నివేదిక తెలిపింది. మ్యూచువల్ ఫండ్ ఖాతాల్లో మహిళలవి 25 శాతమే కాగా.. వ్యక్తిగత రుణ గ్రహీతల్లోనూ వీళ్లు 22 శాతంగానే ఉన్నారు. మొత్తం రుణాల విలువలో మహిళలకు ఇచ్చిన రుణాల వాటా కేవలం 16 శాతమేనని తెలిపింది.
డిజిటల్ పరికరాల వినియోగంలోనూ పురుషులు, మహిళల మధ్య వ్యత్యాసం చాలా ఉంది. 36 శాతం మంది మహిళలు స్మార్ట్‌ఫోన్లను కలిగి ఉండగా.. 58 శాతం మంది పురుషుల వద్ద స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. కుటుంబ సభ్యుల ఫోన్లపై ఆధారపడుతున్న మహిళలు సుమారు 60 శాతం మంది అని నివేదిక తెలిపింది. స్వతంత్రంగా ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడం పైనా ఇది ప్రభావం చూపుతోందని వివరించింది.

వనితల టెక్ అంకురాలు రూ.10,000 కోట్లు సమీకరించాయ్

2025లో మన దేశంలో మహిళా సహ వ్యవస్థాపకులు ఉన్న టెక్ అంకురాలు 407 విడతల్లో 1.1 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.10,000 కోట్లు) సమీకరించాయి. 2024లో సమీకరించిన 1.2 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఇది 9 శాతం తక్కువని డేటా ఇంటెలిజెన్స్ సంస్థ ట్రాక్సన్ నివేదికలో పేర్కొంది. ఫండింగ్ రౌండ్ల సంఖ్య 29 శాతం తగ్గినప్పటికీ (2024లో 580 నుంచి 2025లో 407కు), మధ్య స్థాయి ఒప్పందాల సగటు పరిమాణం 2024లో 2.4 మి.డాలర్ల నుంచి 2025లో 3.8 మిలియన్ డాలర్లకు పెరిగింది. అధిక విశ్వాసం, స్థిరమైన వ్యాపారం, స్పష్టమైన ఆదాయం కలిగిన కంపెనీలపై పెట్టుబడిదారులు దృష్టిపెడుతున్నారు. ప్రారంభ దశ నిధుల సమీకరణ 2024లో 528 మి.డాలర్ల నుంచి 2025లో 572 మి.డాలర్లకు చేరింది. అయితే సీడ్ స్టేజ్, లేట్ స్టేజ్ నిధుల సమీకరణ వరుసగా 259 మి.డాలర్లు, 283 మి.డాలర్లకు పరిమితమయ్యాయి.
జువెలరీ బ్రాండ్ జివా, 2025 జూన్‌లో సిరీస్ సి ఫండింగ్ రౌండ్‌లో 62 మి.డాలర్లను సమీకరించింది. అదే నెలలో స్పెషాలిటీ కాఫీ చెయిన్ బ్లూ టోకాయ్ కాఫీ రోస్టర్స్ 25 మి.డాలర్లను రాబట్టింది. 2025లో 447 మి.డాలర్ల నిధులతో బెంగళూరు అగ్రస్థానంలో నిలిచింది. గురుగ్రామ్ (115 మి.డాలర్లు), ముంబయి (112 మి.డాలర్లు) తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

## హెచ్‌డీఎఫ్‌సీ రుణగ్రహీతలకు గుడ్‌న్యూస్ ..తగ్గిన ఎంసీఎల్ఆర్ రేట్లు

ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీ రుణగ్రహీతలకు గుడ్‌న్యూస్ చెప్పింది. నిధుల ఆధారిత రుణ రేట్ల (MCLR)పై 10 బేసిస్ పాయింట్ల మేర తగ్గిస్తున్నట్లు బ్యాంకు ఓ ప్రకటనలో పేర్కొంది. దీంతో గృహ, వ్యక్తిగత రుణాలపై ఈఎంఐ తగ్గే అవకాశం ఉంది. ఈ మేరకు చేసిన మార్పులు నేటి నుంచి అమల్లోకి రానున్నాయి.

రుణగ్రహీతలు తీసుకున్న రుణ కాల పరిమితి ఆధారంగా MCLR రేట్లను గతంలో 8.25% నుంచి 8.60% వరకు బ్యాంకు వసూలు చేసింది. ప్రస్తుతం చేసిన మార్పుల ఆధారంగా వడ్డీ రేట్లు 8.15% నుంచి 8.55% వరకు తగ్గాయి. ఫిబ్రవరి నెలతో పోలిస్తే మార్చినెలలో తగ్గిన MCLR రేట్లను పరిశీలిస్తే.. నెల కాలపరిమితి గల రుణాలపై 10 బేసిన్ పాయింట్ల మేర తగ్గించింది. అంటే 8.25% నుంచి 8.15% మేర ఎంసీఎల్ఆర్ రేట్లు తగ్గాయి. 5 బేసిస్ పాయింట్లతో 3 నెలల కాలపరిమితి రుణాలపై ఎంసీఎల్ఆర్ రేట్లు 8.30% నుంచి 8.25%, 6 నెలలు, ఏడాది రుణాలపై 8.40% నుంచి 8.35%, 2 ఏళ్ల రుణాలపై 8.50% నుంచి 8.45%, 3 ఏళ్ల రుణాలపై 8.60% నుంచి 8.55%కు బ్యాంకు తగ్గించింది. కాగా, ఫిక్స్‌డ్ డిపాజిట్ల ఖాతాదారులకు కూడా బ్యాంకు గుడ్‌న్యూస్ చెప్పింది. కొన్ని ఎఫ్‌డీలపై వడ్డీరేటును 10 బేసిస్ పాయింట్ల మేరకు పెంచుతున్నట్లు బ్యాంకు వెల్లడించిన విషయం తెలిసిందే.

HDFC BANK

## ఆసక్తి రేకెత్తించేలా విక్రమ్ ఆన్ డ్యూటీ



విక్రమ్ ఆన్ డ్యూటీ' కథ చాలా ఆసక్తికరంగా ఉంద"న్నారు సంగీత దర్శకుడు ఎం.ఎం కీరవాణి. కొమ్మూరి సాంబశివరావు డిటెక్టివ్ నవలల్లో కనిపించే ఆసక్తికర నేర పరిశోధన.. మధుబాబు నవలల్లో ఉండే యాక్షన్.. ఈ రెండూ ఈ సిరీస్‌లో ఉంటాయని ఆశిస్తున్నానన్నారు. బిగ్‌బాస్ విజేత నిఖిల్ మలియక్కల్ హీరోగా బ్రహ్మ రుద్ర తెరకెక్కించిన వెబ్‌సిరీస్ ఇది. జ్ఞాపిక ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ప్రవీణ, అనిల్ కడియాల నిర్మించారు. ఈ సిరీస్ ప్రస్తుతం ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. సంగీత దర్శకుడు ఎం.ఎం కీరవాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఈ చిత్ర గ్లింప్స్ చూశాను. హంట్ అనే యూనిట్ ద్వారా క్రైమ్ ఇన్వెస్టిగేషన్ జరుగుతోంది. ఈ సిరీస్‌తో కొత్త ప్రతిభ పరిచయమవుతున్నందుకు ఆనందంగా ఉంది" అన్నారు. "ఈ సిరీస్ కచ్చితంగా అందరికీ నచ్చేలా ఉంటుంది. మా నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా ఖర్చు చేశారు" అన్నారు దర్శకుడు బ్రహ్మ రుద్ర. నిర్మాత ప్రవీణ మాట్లాడుతూ.. "మా ప్రాజెక్ట్ జియో హాట్‌స్టార్‌లో రావడం అదృష్టంగా భావిస్తున్నాం. ఈ సిరీస్ కచ్చితంగా అందర్నీ అలరిస్తుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో నిఖిల్, అమర్, ఆషు రెడ్డి, సుహాస్, శ్రీహర్ష, అనిల్ కడియాల తదితరులు పాల్గొన్నారు.




## చిరుకు పవన్ కల్యాణ్ అభినందనలు..

అగ్ర కథానాయకుడు చిరంజీవి మరో గౌరవాన్ని అందుకోనున్నారు. తాజాగా గద్దర్ అవార్డులను (Gaddar Awards) తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో చిరంజీవిని ఎన్టీఆర్ జాతీయ పురస్కారం వరించింది. దీంతో ఆయనకు అభినందనలు చెబుతూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ (pawan Kalyan) పోస్ట్ పెట్టారు. ఈ వార్త తనకెంతో సంతోషాన్నిచ్చిందని తెలిపారు. తెలుగు సినీ పరిశ్రమలో చిరంజీవి (Chiranjeevi) ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. గద్దర్ అవార్డులకు ఎంపికైన ప్రతి ఒక్కరికీ పవన్ శుభాకాంక్షలు తెలిపారు.

దుల్ల కొట్టావ్ నాన్న: నాగార్జున

ఇక ఈ అవార్డు విజేతలకు అగ్ర కథానాయకుడు నాగార్జున (Nagarjuna) కూడా సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తన కుమారుడు నాగచైతన్యను ప్రత్యేకంగా అభినందించారు. చైతూ ఉత్తమ నటుడిగా ఎంపికైనందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. 'తండేల్' సినిమాలో అద్భుతంగా నటించాడని, ఈ అవార్డుకు అతడు అర్హుడని కొనియాడారు. 'దుల్ల కొట్టావ్ నాన్న' అంటూ తండేల్ డైలాగుకు హార్ట్ ఎమోజీ జోడించి అభినందించారు. తెలంగాణ ప్రభుత్వానికి నాగార్జున కృతజ్ఞతలు తెలిపారు. ఏయన్నార్ పేరుతో అవార్డును ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏయన్నార్ అవార్డు జయసుధకు రావడం ఆనందంగా ఉందన్నారు.

## అప్పుడు దీపిక 8 గంటలు అడగలేదు..కానీ ...అనన్య పాండే



ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారిన వర్కింగ్ అవర్స్ అంశంపై తాజాగా నటి అనన్య పాండే (Ananya Panday) మాట్లాడారు. కరీనా కపూర్, కల్యాణి ప్రియదర్శన్‌లతో కలిసి ఆమె 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఇందులో వర్కింగ్ అవర్స్ గురించి ప్రస్తావించారు.

"దీపికా పదుకొణె (Deepika Padukone) అంకితభావం ఉన్న నటి. నేను ఆమెతో కలిసి పని చేశాను. అప్పుడు దీపిక ఎలాంటి డిమాండ్లు చేయలేదు. వర్క్‌షాప్‌లకు కూడా వచ్చేవారు. షూటింగ్ విషయంలో ఎప్పుడూ ఫిర్యాదులు చేయలేదు. ఇప్పుడు ఆమె ఒక బిడ్డకు తల్లి. ఆ పాపకు కనీసం రెండేళ్లు అయినా పూర్తిగా దీపిక అవసరం ఉంటుంది. అందుకే ఇప్పుడు ఇలాంటి డిమాండ్ చేశారు. ఇందులో తప్పేం లేదు. ఆమె డిమాండ్‌కు పూర్తి మద్దతు ఇస్తాను" అని అనన్య అన్నారు.

కరీనా తల్లి అయిన తర్వాత ఇండస్ట్రీలో పాత ఆలోచనా ధోరణిని మార్చేశారని అనన్య అభిప్రాయపడ్డారు. ఆమె తీసుకున్న కొన్ని నిర్ణయాలు ఇప్పుడు వస్తోన్న హీరోయిన్లకు ఎంతో ధైర్యాన్ని ఇస్తున్నాయన్నారు. పరిశ్రమలో హీరోయిన్స్ తమ వ్యక్తిగత జీవితానికి, వృత్తికి మధ్య సమతుల్యత పాటించేలా నిర్మాతలతో చర్చలు జరపడంలో తప్పలేదని అనన్య పేర్కొన్నారు. పని వేళల విషయంలో ఎటువంటి కఠినమైన నిబంధనలు ఉండకూడదన్నారు. దీపికా లాంటి స్టార్ హీరోయిన్ ఇలాంటి మార్పును డిమాండ్ చేయడం వల్ల భవిష్యత్తులో అందరికీ మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

## గద్దర్ అవార్డ్స్ 2025







ఈ కబురు, హైదరాబాద్ :
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2025' విజేతలను ప్రకటించింది. సినిమా ఇండస్ట్రీల్లో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు పురస్కారం అందజేయనున్నారు. మార్చి 19, 2026న ఉగాది పర్వదినం సందర్భంగా ఈ పురస్కార వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. శనివారం జ్యూరీ సభ్యులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి అవార్డు జాబితా ఫైనల్ లిస్ట్‌ను అందజేశారు. అనంతరం అవార్డు కమిటీ చైర్మన్ తమ్మారెడ్డి భరద్వాజ అవార్డు విన్నర్‌లను ప్రకటించారు.

--ప్రత్యేక అవార్డులు
చిరంజీవికి ఎన్టీఆర్ నేషనల్ అవార్డు
అశ్వినీదత్‌కు నాగిరెడ్డిచక్రపాణి అవార్డు
సింగీతం శ్రీనివాసరావుకు బీఎన్‌రెడ్డి అవార్డు
కమల్‌హాసన్‌కు పైడి జయరాజ్ అవార్డు
జయసుధకు అక్కినేని స్పెషల్(ఫిమేల్) అవార్డు
సుద్దాల అశోక్ తేజకు సినారే అవార్డు
రమేష్‌కు ప్రసాద్‌కు రఘుపతి వెంకయ్య అవార్డు
ఆర్. నారాయణమూర్తికి కాంతారావు అవార్డు వరించాయి.

అవార్డు విజేతలు
ఉత్తమ నటుడు నాగ చైతన్య (తండేల్)
ఉత్తమ నటి రష్మిక మందన్న (ది గర్ల్ ఫ్రెండ్)
ఉత్తమ చిత్రం రాజు వెడ్స్ రాంబాయి
ఉత్తమ ద్వితీయ చిత్రం దండోరా
ఉత్తమ తృతీయ చిత్రం ది ప్రీ వెడ్డింగ్ షో
బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్ తండేల్
ఉత్తమ పర్యావరణ చిత్రం ఇగ్వా
ఉత్తమ డెబ్యూ ఫీచర్ ఫిల్మ్ లిటిల్ హార్ట్స్
ఉత్తమ వినోదాత్మక చిత్రం సంక్రాంతికి వస్తున్నాం
ఉత్తమ సోషల్ మెసేజ్ చిత్రం కోర్టు
ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్ మూవీ మిరాయ్
ఉత్తమ బాలల చిత్రం అనగనగా
ఉత్తమ దర్శకుడు సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ సపోర్టింగ్ నటుడు శివాజీ
ఉత్తమ సపోర్టింగ్ నటి భూమిక
ఉత్తమ సంగీత దర్శకుడు మార్క్ కె రాబిన్ (దండోరా)
ఉత్తమ నేపథ్య గాయకుడు అనురాగ్ (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ నేపథ్య గాయని సాహితి చాగంటి (కన్నప్ప)
ఉత్తమ హాస్యనటుడు కృష్ణ తేజ (జిగ్రీస్)
ఉత్తమ బాలనటుడు రోహన్ రాయ్ (ప్రీ వెడ్డింగ్ షో)
ఉత్తమ కథా రచయిత గుణశేఖర్ (యుఫోరియా)
ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్ అనిల్ రావిపూడి
ఉత్తమ గేయ రచయిత నందకిశోర్ (కుబేర)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్ కార్తిక్ ఘట్టమనేని (మిరాయ్)
ఉత్తమ ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ (మిరాయ్)
ఉత్తమ ఆడియోగ్రాఫర్ ఎం.ఆర్ రాధాకృష్ణన్ కిష్కిందపురి
ఉత్తమ కొరియోగ్రాఫర్ ఆట సందీప్ గిర గిర గిర
ఉత్తమ ఆర్ట్ డైరక్టర్ తోట తరణి ఛాంపియన్
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ గోవింద్ అఖండ
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ చాంపియన్ చంద్రకాంత్
ఉత్తమ స్పెషల్ జ్యూరీ ఫిల్మ్ 23
ఉత్తమ మేల్ యాక్టర్ చైతూ జొన్నలగడ్డ (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ నటి అనంతిక (8 వసంతాలు)
స్పెషల్ జ్యూరీ హీరో రోషన్ (చాంపియన్)..

## టికెట్ ధర పెంపు లేకుండానే 'ధురంధర్2' పెయిడ్ ప్రీమియర్స్.. భారీ రన్‌టైమ్..




'ఈసారి పాకిస్థాన్ భవిష్యత్‌ను నిర్ణయించేది భారత్' అంటున్నారు రణ్‌వీర్ సింగ్ (Ranveer Singh). ఆయన కథానాయకుడిగా ఆదిత్యధర్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్2: ది రివెంజ్'. (Dhurandhar the revenge) సారా అర్జున్ కథానాయిక. మాధవన్, సంజయ్‌దత్, అర్జున్ రాంపాల్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ మార్చి 19న ప్రేక్షకుల ముందుకు (dhurandhar the revenge release date) రానుంది. ఈ సందర్భంగా శనివారం విడుదల చేసిన ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచింది. 'ధురంధర్: పార్ట్ 1'తో పోలిస్తే రెండో భాగంలో యాక్షన్‌తో పాటు ఎమోషనల్ డ్రామాకు పెద్ద పీట వేసినట్లు తెలుస్తోంది. మరోవైపు 'ధురంధర్'కు వచ్చిన క్రేజ్‌ను ఒడిసిపట్టుకునేందుకు చిత్ర బృందం సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా ఒకరోజు ముందుగానే పెయిడ్ ప్రీమియర్స్ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సిద్ధమైంది. అంటే మార్చి 18వ తేదీ సాయంత్రం ఫస్ట్ షో నుంచే 'ధురంధర్2: ది రివెంజ్' మూవీని ప్రదర్శించబోతోంది. ఇప్పటికే బుక్‌మై షో, డిస్ట్రిక్ట్ యాప్‌ల ద్వారా టికెట్ బుకింగ్స్‌ను (Dhurandhar the revenge advance booking) అందుబాటులోకి తెచ్చింది. హిందీతో పాటు, ఇతర దక్షిణాది భాషల్లో ఈ సినిమాను తీసుకొస్తున్నా.. పెయిడ్ ప్రీమియర్స్ వరకు హిందీలోనే బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. హైదరాబాద్‌లోని వివిధ మల్టీప్లెక్స్‌లలో ఇప్పటికే టికెట్స్ అందుబాటులోకి వచ్చాయి. సాధారణంగా పెయిడ్ ప్రీమియర్స్‌కు టికెట్ ధర స్పెషల్‌గా ఉంటుంది. కానీ, 'ధురంధర్2' టికెట్ ధరల్లో ఎలాంటి పెంపు లేకపోవడం గమనార్హం. దీనిని బట్టి చూస్తే, ఎక్కువ మంది ప్రేక్షకులు థియేటర్‌కు రావడమే లక్ష్యంగా చిత్ర బృందం పావులు కదుపుతున్నట్లు అర్థమవుతోంది.

భారీ రన్‌టైమ్..

ప్రస్తుతం బుకింగ్స్ మొదలైన నేపథ్యంలో సినిమా రన్‌టైమ్‌పైనా స్పష్టత వచ్చింది. ఇప్పటి వరకూ సోషల్‌మీడియా వేదికగా జరిగిన చర్చలకు ఫుల్‌స్టాప్ పెడుతూ 'ధురంధర్ 2: ది రివెంజ్' నిడివి 3 గంటల 55 (Dhurandhar 2 runtime) నిమిషాలతో రానున్నట్లు బుక్‌మై షోలో చూపిస్తోంది. మొదటి భాగం 3 గంటలా 34 నిమిషాలతో పోలిస్తే చాలా ఎక్కువే. ఇంటర్వెల్‌తో కలిపి దాదాపు నాలుగు గంటలపైనే (dhurandhar 2 duration) ప్రేక్షకుడు థియేటర్‌లో ఉండాలి. మరి సినిమాలో అంత బలమైన కంటెంట్ ఉందా? అంటే ఆ విషయంలో ఏ మాత్రం వెనక్కి తగ్గేదిలేదని ఆదిత్య ధర్ అంటున్నారట. దీన్ని బట్టి ట్రైలర్‌లో చూపించింది చాలా తక్కువే అనిపిస్తోంది.

ఆ ప్రశ్నలన్నింటికీ సమాధానం..

గతేడాది కేవలం హిందీలోనే విడుదలైన 'ధురంధర్' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా హిందీతో పాటు, తెలుగు, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇక 'ధురంధర్2'లో అనేక ప్రశ్నలకు సమాధానం లభించనుంది. (Dhurandhar 2 cast) జస్కిరాత్ సింగ్ రాంగి (రణ్‌వీర్) భారత్‌లో ఉండగా ఎందుకు జైలుకు వెళ్లాల్సి వచ్చింది? అతడు చేసిన నేరం ఏంటి? అతడి పేరును హమ్జాగా మార్చిన అజయ్ సన్యాల్ (మాధవన్) ఎందుకు గూఢచారిగా ఎంపిక చేశాడు? రెహమాన్ డెకాయిత్ (అక్షయ్ ఖన్నా) చనిపోయిన తర్వాత ల్యారీని హమ్జా ఎలా తన గుప్పిట్లోకి తీసుకున్నాడు? ఇండియాపై కుట్రలు చేస్తున్న మేజర్ ఇక్బాల్ (అర్జున్ రాంపాల్)ను ఎలా మట్టుబెట్టాడు? ఈ క్రమంలో ఎస్పీ అస్లామ్ చౌదరి (సంజయ్ దత్) నుంచి ఎలాంటి ప్రతిఘటన ఎదురైంది? ఇంతకీ బడేసాబ్ (...) ఎవరు? అన్న ప్రశ్నలకు 'ధురంధర్2' సమాధానం చెప్పనుంది.

## భార్యకు సర్‌ప్రైజ్ ఇచ్చిన అల్లు అర్జున్.. మ్యారేజ్ డే గిఫ్ట్ ఇదే!



స్టార్ హీరో అల్లు అర్జున్ (Allu Arjun) తన భార్య అల్లు స్నేహారెడ్డికి సడెన్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. తమ 15వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆమెను ఆశ్చర్యపరుస్తూ అత్యంత ఖరీదైన బెంజ్ కారును కానుకగా అందజేశారు. మార్చి 6న సోదరుడు అల్లు శిరీష్ వివాహ వేడుక జరిగిన సంగతి తెలిసిందే. 15 ఏళ్ల కిందట అల్లు అర్జున్ కూడా ఇదే రోజు స్నేహారెడ్డిని వివాహం చేసుకున్నారు. ఈ సందర్భంగా గుర్తుండిపోయేలా తండ్రి అల్లు అరవింద్, కుమారుడు అల్లు అయాన్ సమక్షంలో కారు తాళాలను స్నేహారెడ్డికి ఇచ్చారు. బన్ని ఇచ్చిన సర్‌ప్రైజ్‌తో స్నేహారెడ్డి తెగ సంబరపడిపోయారు. కుటుంబ సభ్యులు కూడా ఇరువురికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు చెప్పడంతో అల్లు వారి ఇంట ఆనందాలు రెట్టింపు అయ్యాయి

## ఫైనల్ మ్యాచ్‌లో మార్పులుంటాయా?




అహ్మదాబాద్: టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో నేడు న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది. ఈ క్రమంలో టీమ్‌ఇండియా తుది జట్టులో మార్పులుంటాయా అన్నది ఆసక్తికరంగా మారింది. టోర్నీలో పేలవ ప్రదర్శన చేసిన అభిషేక్ శర్మపై వేటు వేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నప్పటికీ.. కుదురుకుంటే నిమిషాల్లో మ్యాచ్ ఫలితాన్ని శాసించగల అతణ్ని ఈ మ్యాచ్‌కు తప్పించడం సందేహమే. అతణ్ని తప్పిస్తే రింకు సింగ్‌ను ఆడించాలి. అతనూ ఫామ్‌లో లేడు కాబట్టి అభిషేక్‌నే ఆడించే అవకాశాలు ఎక్కువ. మరోవైపు వరుణ్ చక్రవర్తి స్థానంలో కుల్‌దీప్‌ను ఎంచుకోవచ్చన్న చర్చా జరుగుతోంది. అయితే వరుణ్‌కు ఇంకో అవకాశం ఇవ్వాలని, అహ్మదాబాద్ పిచ్ స్పిన్‌కు అనుకూలం కాబట్టి అర్ష్‌దీప్ స్థానంలో కుల్‌దీప్‌ను మూడో స్పిన్నర్‌గా ఎంచుకోవడం మంచిదనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. మరి జట్టు యాజమాన్యం నిర్ణయం ఎలా ఉంటుందో మరికొన్ని గంటల్లో తేలనుంది.

# ట్రిపుల్ టైటిల్ వేటలో...







భారత జట్టు 2024 టి20 ప్రపంచ కప్‌లో విజేతగా నిలిచిన తర్వాత ఇప్పటి వరకు 49 మ్యాచ్‌లు ఆడితే 40 గెలిచింది. 2023 ఆగస్టు నుంచి మన టీమ్ ఒక్క సిరీస్ కూడా కోల్పోలేదు. జట్టులో పలు మార్పులు చేసుకున్నా, ఆఖరి క్షణాల్లో ఆటగాళ్లను చేర్చినా ఫలితాల్లో మాత్రం తేడా రాలేదు. ఎలాంటి నిర్ణయం, వ్యూహమైనా అద్భుతంగా పని చేశాయి. ఇలాంటి విజయాల తర్వాత, ఇంత బలమైన జట్టుకు ఇప్పుడు వరల్డ్ కప్ గెలిచేందుకు అన్ని రకాలుగా అర్హత ఉంది. కానీ అనిశ్చితికి మారుపేరైన టి20 క్రికెట్‌లో కొన్ని అనూహ్య క్షణాలు కూడా రాత మారుస్తాయి. అలాంటివి అధిగమించి టీమిండియా మూడోసారి, వరుసగా రెండోసారి వరల్డ్ కప్‌ను సొంతం చేసుకొని కొత్త చరిత్ర సృష్టించగలదా?

అవతలి వైపు ఉన్న జట్టు మనతో పోలిస్తే చిన్నదే కావచ్చు... బలాబలాల్లో, అనుభవంతో భారత్‌కు పోటీ కాకపోవచ్చు. కానీ పోరాడితే పోయేదేమీ లేదనే తత్వమే న్యూజిలాండ్‌ను ఒక్కసారిగా బలంగా మార్చేస్తుంది. రెండున్నరేళ్ల క్రితం వన్డే వరల్డ్ కప్ ఫైనల్ ఓడిన రోజు భారత అభిమానులకు ఇప్పటికీ ఒక చేదు జ్ఞాపకం... కానీ నేటి ఫైనల్లో కివీస్ ఓడితే తర్వాతి వారంలో ఆ దేశంలో అంతా మరచిపోతారు. వారి రోజూవారీ సంవాదనల్లో అది ఒక విషయమే కాదు. ఆ టీమ్‌లో స్టార్ పేసర్ లేకపోయినా, మిస్టరీ స్పిన్నర్ లేకపోయినా గెలిచేందుకు కావాల్సినంత కసి ఉంది. ఇప్పుడు అలాంటిదే వారికి మొదటి టి20 వరల్డ్ కప్ అందించాలి. ప్రపంచకప్‌లలో పడిన 'రన్నరప్' ముద్రను ఆ జట్టు మార్చగలదా?

వ్యూహ ప్రతివ్యూహాలు, భావోద్వేగాలు, ప్రతిభ మాత్రమే సరిపోదు, కాస్త అదృష్టం కూడా కలిసి రావాలి...చివరకు రోజు ముగిసేసరికి ఒక్క జట్టుకు మాత్రం సంపూర్ణ ఆనందం దక్కితే మరో జట్టుకు తీవ్ర నిరాశ ఖాయం. ఒక్క దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో ఓటమి మినహా టోర్నీ ఆసాంతం టీమిండియా మెరుగైన ప్రదర్శన కనబర్చగా... పడుతూ, లేస్తూ ప్రయాణం సాగించిన కివీస్ సెమీస్‌లో దక్షిణాఫ్రికా పైనే భారీ విజయంతో ఒక్కసారిగా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. ఈ నేపథ్యంలో పదో టి20 వరల్డ్ కప్ తుది పోరుకు రంగం సిద్ధమైంది. దాదాపు లక్ష మంది ప్రేక్షకుల సమక్షంలో జరిగే ఫైనల్ పోరులో భారత్, న్యూజిలాండ్ అమీతుమీ తేల్చుకోనున్నాయి.

అహ్మదాబాద్: టి20 ప్రపంచ కప్‌లో రెండుసార్లు (2007, 2024) విజేతగా నిలిచి ఇప్పుడు మూడో టైటిల్‌పై గురి పెట్టిన జట్టు ఒకవైపు...తొమ్మిది ప్రయత్నాల్లో ఒక్కసారి కూడా ట్రోఫీని అందుకోలేకపోయిన జట్టు మరోవైపు... ఒక టీమ్ టోర్నీ గెలిస్తే తొలిసారి 'ట్రిపుల్' సాధించిన జట్టు కావడంతో పాటు సొంతగడ్డపై నెగ్గిన తొలి టీమ్‌గా కొత్త చరిత్ర సృష్టిస్తుంది. మరో టీమ్ గెలిస్తే సుదీర్ఘ కాలంగా అందకుండా ఊరిస్తున్న వరల్డ్ కప్ కల నెరవేరుతుంది.

ఇలాంటి అంచనాల మధ్య నరేంద్ర మోదీ స్టేడియంలో నేడు డిఫెండింగ్ చాంపియన్ భారత్, న్యూజిలాండ్ మధ్య టి20 వరల్డ్ కప్ ఫైనల్ జరగనుంది. స్వదేశంలో టీమిండియా విజయంపై అభిమానులు భారీ ఆశలతో ఉండగా... కివీస్ తమ స్థాయికి మించిన ప్రదర్శనను కనబర్చాలని పట్టుదలగా ఉంది. 2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిన ఇదే మైదానంలో టి20 వరల్డ్ కప్ ఫైనల్ గెలిచి ట్రోఫీని అందుకోవాలని సూర్యకుమార్ బృందం భావిస్తోంది.

**వరుణ్ స్థానంలో కుల్దీప్!**

ప్రపంచకప్‌లో భారత్ ప్రదర్శన చూస్తే ఇప్పుడు ఫైనల్ కోసం తుది జట్టులో మార్పులు చేయాల్సిన అవసరం కనిపించడం లేదు. కానీ 'సూపర్ ఎయిట్స్' దశలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి పేలవ ఆట జట్టును ఆందోళనకు గురి చేస్తోంది. గతంలో ఎంత ఘనంగా బౌలింగ్ చేసినా టి20ల్లో తాజా ఫామ్ కీలకం. దాదాపు 12 పరుగుల ఎకానమీతో అతను 4 వికెట్లు మాత్రమే పడగొట్టగలిగాడు.

వరుణ్ మిస్టరీని ప్రత్యర్థులు ఛేదించినట్లుగా కనిపిస్తోంది. టీమ్ మేనేజ్‌మెంట్ కూడా ఇదే భావిస్తే అతని స్థానంలో ఎడంచేతి వాటం స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు అవకాశం దక్కవచ్చు. ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్‌పై కూడా కాస్త సందేహం ఉన్నా... ఒంటిచేత్తో ఆట స్వరూపాన్ని మార్చే అతడిని పక్కన పెట్టే ఆలోచన చేయకపోవచ్చు.

సంజు సామ్సన్ గత రెండు మ్యాచ్‌లలో చెలరేగిన విధంగా మరో నాకౌట్ మ్యాచ్‌లోనూ ఆడితే జట్టుకు తిరుగుండదు. సూర్యకుమార్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ కూడా సత్తా చాటితే భారీ స్కోరు ఖాయం. చివర్లో హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ వేగంగా అందించే అదనపు పరుగులతో ప్రత్యర్థికి టీమిండియా సవాల్ విసరడం ఖాయం.ముందుగా బ్యాటింగ్ చేస్తే మరోసారి 200కు పైగా స్కోరు చేస్తే జట్టు నిశ్చింతగా ఉండవచ్చు.

**డఫీకి చోటు!**

న్యూజిలాండ్ విజయావకాశాలన్నీ ఇప్పుడు ఓపెనింగ్ జోడీ ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్‌లపై ఆధారపడి ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. దక్షిణాఫ్రికాపై మెరుపు వేగంతో చెలరేగిన వీరిద్దరు మరోసారి శుభారంభం అందించగలరు. ఇన్నింగ్స్ మొదట్లోనే బుమ్రా, అర్ష్‌దీప్ వీరిని కట్టడి చేయడం కీలకం. రచిన్ రవీంద్ర ఆల్‌రౌండర్‌గా రాణిస్తుండగా, ఫిలిప్స్ బ్యాటింగ్ కూడా కీలకం. వరల్డ్ కప్‌కు ముందు భారత్‌పై చెలరేగిన మిచెల్ ఈ టోర్నీలో పూర్తిగా విఫలం కావడం జట్టును దెబ్బ తీసింది.

అసలు సమరంలోనైనా అతను తన స్థాయికి తగినట్లుగా ఆడాలని టీమ్ కోరుకుంటోంది. చాప్‌మన్ ఒక్కటి కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. కెప్టెన్ సాంట్నర్‌పై అటు ఆల్‌రౌండర్‌గా, ఇటు కెప్టెన్‌గా కూడా అదనపు భారం ఉంది. గతంలో ఏ కివీస్ సారథికి సాధ్యం కాని ఘనతను అందుకోవాలంటే అతను కూడా స్వయంగా అసాధారణ ఆటతీరు కనబర్చాల్సి ఉంది.

పిచ్ కాస్త అనుకూలిస్తే పేసర్లు హెన్రీ, ఫెర్గూసన్ ప్రమాదకారులు కాగలరు. టీమిండియా లెఫ్ట్ హ్యాండర్లను నిలువరించేందుకు ఆఫ్‌స్పిన్నర్ మెక్‌కోన్‌కీ జట్టు సమర్థంగా వాడుకునే ప్రయత్నం చేయడం ఖాయం. ఆల్‌రౌండర్ నీషమ్ స్థానంలో పేసర్ డఫీకి చోటు దక్కే అవకాశం ఉంది.

7 అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో భారత జట్టు ఇప్పటి వరకు 10 టి20 మ్యాచ్‌లు ఆడింది. 7 మ్యాచ్‌ల్లో గెలిచి, 3 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఈ వేదికపై న్యూజిలాండ్‌తో ఆడిన ఒక టి20 మ్యాచ్‌లో భారత జట్టే గెలిచింది.

**పిచ్, వాతావరణం**

ఎర్రమట్టి, నల్లరేగడి మట్టి మిశ్రమం కలిపిన పిచ్‌ను ఫైనల్ కోసం సిద్ధం చేశారు. దీనిపై మంచి పేస్, బౌన్స్ ఉండి బ్యాటింగ్‌కు చక్కగా అనుకూలిస్తుంది. భారీ స్కోరు సాధించేందుకు అవకాశం ఉంది. స్పిన్‌కు తగిన టర్న్ లభించకపోవచ్చు. ఈ మైదానంలోనే దక్షిణాఫ్రికా చేతిలో ఓడినా... ఆ మ్యాచ్‌ను భారత్ మరో పిచ్‌పై ఆడింది.

గత ఎనిమిది మ్యాచ్‌లలో తర్వాత బ్యాటింగ్ చేసిన జట్టే ఐదుసార్లు గెలిచింది. కాబట్టి టాస్ గెలిచిన టీమ్ ఛేదనకే మొగ్గు చూపవచ్చు. అయితే భారత్‌పై సెమీస్‌లో ఇంగ్లండ్ ఒత్తిడిలో చిత్తయిన తీరు చూస్తే ముందుగా బ్యాటింగ్ చేయడమే మేలు. వర్షం సమస్య లేదు. ఒకవేళ వాన వచ్చినా రిజర్వ్ డే ఉంది.

22 భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన గత నాలుగు ఐసీసీ టోర్నీ నాకౌట్ మ్యాచ్‌లలో ఇరు జట్లూ చెరో రెండు గెలిచి 2-2తో సమంగా ఉన్నాయి. 2023 వన్డే వరల్డ్ కప్ సెమీఫైనల్లో, 2025 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్ గెలవగా... 2019 వన్డే వరల్‌డ్‌కప్ సెమీఫైనల్లో, 2021 డబ్ల్యూటీసీ ఫైనల్లో న్యూజిలాండ్ గెలుపొందింది.

16 భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య ఇప్పటి వరకు 30 టి20 మ్యాచ్‌లు జరిగాయి. 16 మ్యాచ్‌ల్లో భారత్, 11 మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ గెలిచాయి. మూడు మ్యాచ్‌లు 'టై'గా ముగిశాయి.

తుది జట్లు (అంచనా)

**భారత్: సూర్యకుమార్ (కెప్టెన్ ), సామ్సన్, అభిషేక్, ఇషాన్ కిషన్, తిలక్‌వర్మ, పాండ్యా, దూబే, అక్షర్, బుమ్రా, అర్ష్ దీప్, వరుణ్/కుల్దీప్.**

**న్యూజిలాండ్: సాంట్నర్ (కెప్టెన్ ), అలెన్, సీఫెర్ట్, రచిన్, ఫిలిప్స్, చాప్‌మన్, మిచెల్, మెక్‌కోన్‌కీ, హెన్రీ, ఫెర్గూసన్, నీషమ్/డఫీ.**

## ఆసీస్‌తో ఏకైక టెస్టు.. కష్టాల్లో భారత మహిళా జట్టు



ఆస్ట్రేలియాతో జరుగుతోన్న ఏకైక పింక్‌బాల్ టెస్టులో భారత మహిళా జట్టు కష్టాల్లో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగుల లీడ్ సాధించిన ఆసీస్ మ్యాచ్‌పై పట్టు సాధించింది. రెండో రోజు ఆట ముగిసేసమయానికి రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 6 వికెట్ల నష్టానికి 105 పరుగులు చేసింది. క్రీజ్‌లో ప్రతీకా రావల్ (43*), స్నేహ్ రాణా (14*) ఉన్నారు. టీమ్‌ఇండియా ఇంకా 20 పరుగులు వెనుకబడే ఉంది. స్మృతి మందాన (2), షెఫాలీ వర్మ (5) తీవ్రంగా నిరాశపరిచారు. జెమీమా రోడ్రిగ్స్ (14), హర్మన్ ప్రీత్ కౌర్ (11), దీప్తి శర్మ (9) కూడా ఎక్కువ పరుగులు చేయలేదు. రిచా ఘోష్ (0) డకౌట్‌గా పెవిలియన్‌కు చేరింది. ఓ వైపు వికెట్లు పడుతున్నా ప్రతీకా మాత్రం నిలకడగా పరుగులు రాబట్టింది. ఆసీస్ బౌలర్లలో హామిల్టన్ 3, అన్నాబెల్ సదర్లాండ్ 2, బ్రౌన్ ఒక వికెట్ పడగొట్టారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 323 పరుగులకు ఆలౌటైంది. టీమ్‌ఇండియా మొదటి ఇన్నింగ్స్‌లో 198 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

## అలా బౌలింగ్ చేయొద్దని వరుణ్‌కు పదేపదే చెప్పా: అశ్విన్




టీ20 ప్రపంచ కప్‌లో భారత్ ఆడిన గత రెండు మ్యాచుల్లో 'మిస్టరీ' స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (Varun Chakravarthy) తేలిపోయాడు. అతడి బౌలింగ్‌లో ప్రత్యర్థి బ్యాటర్లు దూకుడుగా ఆడి భారీ షాట్లతో విరుచుకుపడ్డారు. ఈ క్రమంలో టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వరుణ్ బౌలింగ్ విషయంలో ఇప్పటికే చాలాసార్లు ఓ మాట చెప్పానని తెలిపాడు. తన యూట్యూబ్ ఛానల్‌లో 'యాష్ కి బాత్' చర్చా కార్యక్రమంలో అశ్విన్ మరోసారి పలు సూచనలు చేశాడు. "వరుణ్ విషయంలో ఏం జరుగుతుందనేది ఇప్పుడు పెద్ద చర్చ. ప్రత్యర్థి బ్యాటర్లు అతడిని లక్ష్యంగా చేసుకొని ఎటాకింగ్ చేస్తున్నారా? లేదా వారికి ఛాన్స్ ఇస్తున్నాడా? ఇంగ్లాండ్ బౌలర్ అదిల్ రషీద్ కూడా గూగ్లీలు వేస్తాడు. రషీద్‌ను మన బ్యాటర్లు బాగానే ఎదుర్కొన్నారు. కానీ, అతడు మరీ ఎక్కువ పరుగులు ఇవ్వలేదు. కానీ, వరుణ్ విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అలాంటప్పుడు వ్యూహాలను మార్చుకోవాలి. లైన్ అండ్ లెంగ్త్‌తోపాటు స్పీడ్ వేరియేషన్స్ చూపించాలి. ఇలాంటప్పుడే వరుణ్‌తో మేనేజ్‌మెంట్ మాట్లాడాలి. బ్యాటర్లు ఎటాకింగ్ చేయగానే అతడిలో విశ్వాసం సన్నగిల్లుతోంది. అయితే, ఎడమచేతివాటం బ్యాటర్లు క్రీజ్‌లో ఉన్నప్పుడు రౌండ్ ది వికెట్ నుంచి బౌలింగ్ చేయొద్దని పదేపదే చెప్పి నేను అలసిపోయా'' అని అశ్విన్ వ్యాఖ్యానించాడు. ఇంగ్లాండ్‌పై సెమీస్‌లో వరుణ్ ఏకంగా 64 పరుగులు ఇచ్చాడు.

# ప్రపంచకప్ బెర్త్ లక్ష్యంగా...



హైదరాబాద్: భారత మహిళల హాకీ జట్టు ప్రపంచకప్ బెర్త్ లక్ష్యంగా క్వాలిఫయర్స్ బరిలోకి దిగుతోంది. నేడు తొలి పోరులో భారత జట్టు ఉరుగ్వేతో తలపడుతుంది. గచ్చిబౌలి హాకీ టర్ఫ్ స్టేడియంలో రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ఈ మ్యాచ్ ప్రారంభమవుతుంది. ఈ క్వాలిఫయింగ్ టోర్నీలో మూడు బెర్త్‌ల కోసం మొత్తం 8 జట్లు పోటీపడుతున్నాయి. ఆతిథ్య భారత్‌తో పాటు ఇంగ్లండ్, స్కాట్లాండ్, దక్షిణ కొరియా, ఇటలీ, ఉరుగ్వే, వేల్స్, ఆ్రస్టియాలు క్వాలిఫయర్స్‌లో సత్తా చాటేందుకు సిద్ధమయ్యాయి. 8 జట్లను రెండు పూల్స్‌గా విభజించారు. పూల్ 'ఎ'లో ఇంగ్లండ్, కొరియా, ఇటలీ, ఆస్ట్రియా... పూల్ 'బి'లో భారత్, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ ఉన్నాయి. లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాక రెండు పూల్స్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్ చేరుకుంటాయి. సెమీఫైనల్స్ మార్చి 13న... మూడో స్థానం కోసం మ్యాచ్, ఫైనల్ మ్యాచ్ మార్చి 14న జరుగుతాయి.

ఈ క్వాలిఫయింగ్ టోర్నీలో టాప్–3లో నిలిచిన జట్లు ఆగస్టులో బెల్జియం, నెదర్లాండ్స్‌లలో జరిగే ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధిస్తాయి. తొలి రోజు ఆదివారం ఇంగ్లండ్‌తో ఇటలీ (మధ్యాహ్నం గం. 12:45 నుంచి); కొరియాతో ఆస్ట్రియా(మధ్యాహ్నం గం. 3 నుంచి); స్కాట్లాండ్స్‌తో వేల్స్ (సాయంత్రం గం. 5:15 నుంచి) కూడా తలపడతాయి.

# లక్ష్య సేన్ అదరహో



బర్మింగ్‌హామ్: భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు చేరాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-16, 18-21, 21-15తో కెనడాకు చెందిన విక్టర్ లాయ్‌పై తుదికంటా పోరాడి గెలిచాడు. తాజా ప్రపంచ చాంపియన్‌ప్ (పారిస్-2025) కాంస్య పతక విజేత అయిన విక్టర్‌ను ఓడించేందుకు లక్ష్య సేన్ ఏకంగా 97 నిమిషాల పాటు శ్రమించాడు.

కాలి పాదాలు మంటపెడుతున్నా... కోర్టులో తన కదలికలతో నొప్పి మరింత పెరిగినా అన్నీ భరించి ప్రత్యర్థిని మట్టికరిపించాడు. నేడు జరిగే టైటిల్ పోరులో చైనీస్ తైపీ షట్లర్ లిన్ చున్ యితో లక్ష్య సేన్ తలపడతాడు. కాలి పాదం గాయాన్ని పంటి బిగువన భరించి సెమీస్‌లో చెమటోడ్చిన భారత షట్లర్ 25 ఏళ్ల తర్వాత చరిత్రలో నిలిచేందుకు ఇప్పుడు అడుగు దూరంలో నిలిచాడు. సుప్రసిద్ధ ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత్ ఖాతాలో రెండే టైటిల్స్ ఉన్నాయి. ప్రకాశ్ పదుకొనె (1980), పుల్లెల గోపీచంద్ (2001) మాత్రమే గెలిచారు. కానీ 24 ఏళ్ల లక్ష్యసేన్ పుట్టాక మరో టైటిల్ రానేలేదు. తనే నాలుగేళ్ల క్రితం 2022లో గెలిచే ప్రయత్నం చేసినా... ఫైనల్ తడబాటు వల్ల చివరకు రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. అయితే అప్పటికీ ఇప్పటికీ లక్ష్యసేన్ ఎంతో మారాడు. అనుభవం సంపాదించాడు. నైపుణ్యం పెంచుకున్నాడు. ఇక చరిత్రకెక్కడమే తరువాయి!